# 2 + 2

శ్రీ విరియాల లక్ష్మీపతిరావు

నా పేరు కిరణ్మయి. పూర్తి పేరు సుచిత్రా కిరణ్మయి. వయస్సు 19. మిగతా వివరాలు: 36—26—36. పొడుగు 5'4". ఈ వైటల్ స్టాటిస్టిక్స్‌తో (బస్ట్, వేస్ట్, హిప్స్ కొలతలు) మిస్ ఇండియా పోటీలో పాల్గొన్నాను. పేరు లాగే మనిషిని కూడా బావుంటానని (పేరు బావుంటుం దనుకునే పక్షంలో) యింట్లో మా నాన్నగారు, బయట స్నేహితులు అంటూంటే పోటీకివెళ్ళాను. స్త్రీలు మెదడు మీద కంటె శరీరం మీద ఎక్కువ జాగ్రత్త తీసుకోవడం అవసరం. ఎందుకంటే నేను లిస్ట్‌లో ఆఖరుదాన్ని. మిగతా వాళ్ళందర్నీ చూస్తే నాకు చాలా ఉక్రోషం వచ్చేసింది. ఫౌండేషన్ వేసి లక్మ్మె పౌడర్ రాసేస్తే సరిపోతుందా? వాళ్ళు ఎన్నాళ్ళు కృషిచేస్తే అలాంటి స్లిమ్‌నెస్ వచ్చిందా అని ఆలోచించాను.

మిస్ ఇండియా కంటెస్ట్‌కు వయస్సు పదునెనిమిది దాటాలి. ఇరవైఆరు దాటకూడదు. మళ్ళీ ప్రయత్నిస్తానో లేదో చెప్పలేనుకాని అందంగా ఉన్న ఆడవాళ్ళు మాత్రం తమ అందం గురించి గర్వపడటం మానేస్తే మంచిది. అందం కంటె స్లిమ్‌గా, స్మార్ట్‌గా ఆరోగ్యంగా ఉన్నవాళ్ళంటే యువకులు యిష్టపడతారని నేననుకుంటున్నాను. అందులోనూ అందమైన భార్యను మనపూర్వులు ఏమన్నారో తెలిసిన యువకులు అలాంటి భార్య కోసం అట్టే తాపత్రయ పడరని కూడా అనుకో వచ్చు. అందానికి పై మూడూ తోడై, వాటికి మోడెస్టీ, కల్చర్ లాంటివి సాయపడితే అప్పుడు అందానికి విలువ నివ్వవచ్చు. అంతవరకూ అక్కర్లేదు. ఇది నా ఉద్దేశ్యం. ముఖం గురించి తీసుకున్న శ్రద్ధ మిగతా శరీరం గురించి తీసుకోం గదా! కంటెస్ట్‌లో ఎన్నిరకాల పరీక్షలు చేస్తారో చూస్తే యిలాంటి ఉద్దేశ్యమే కలుగుతుంది. ఆ పరీక్షలన్నీ వివరించడం సభ్యత కాదని వూరుకొంటున్నాను.

నేను పుట్టినది కలకత్తాలో. పెరగడం కూడా కలకత్తాలోనే. ఇప్పటి వరకూ ఆంధ్రా ఎప్పుడూ వెళ్ళలేదు. కిండర్ గార్టెన్‌లో ఉన్నన్నాళ్ళూ నాకు తెలుగులో మాట్లాడటం కూడా సరిగా వచ్చేది కాదని మా నాన్నగారు అంటూ వుంటారు. ఆల్బర్టో మొరేవియా నవలలు చదివిన తర్వాత ప్రతివాళ్ళనీ సెక్స్— స్కేల్‌లోనే కొల వడం అలవాటయింది. లూయీ కెరాల్ వ్రాసిన 'ఎలిస్ ఇన్ వండర్ లాండ్' చదివిన తర్వాత చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా వాదన చెయ్యడం నేర్చుకున్నాను. నాలాగా తయారవకుండా ఉంటే ఇంగ్లీషు వచ్చిన వారంతా యీ పుస్తకం చదివి తీరవలిసిందే. పుస్తకాల ప్రభావం చాలాఉంటుంది ప్రతి వాళ్ళ మీదా. మార్క్స్ చదివి కమ్యూనిష్టయి పోయి, బ్రెగాండ్ రసెల్ చదివి పేసిఫిష్టయి, ముసోలినీ గురించి చదివి ఫాసిష్టయి, హిట్లరు గురించి చదివి నియంతృత్వం కావాలంటే అలాంటి మనుషుల్లో వ్యక్తిత్వానికి చోటేముంది?

ఈ రోజుల్లో పుస్తకాల కంటె పొలిటిక్స్, సైకాలజీ కంటె సినిమాలు మనుష్యుల మీద ఎక్కువ ప్రభావం కనపరుస్తున్నట్లు తోస్తోంది. నేను పుట్టక మునుపు మా అమ్మ బెంగాలీ సిని మాలు ఎక్కువగా చూసేదట. దానితో ఆవిడకు యిష్టమున్న తారపేరు ఆడపిల్ల పుడితే పెట్టా లని మా నాన్నగారితో అనేదిట. ఇలాంటి సెంటిమెంట్స్ నాకిష్టంలేదు. ఇది కూడా దేముడి

మొక్కులాంటి మొక్కేనను కుంటాను. ఆవిడ బ్రతికే ఉంటే నాపేరు తప్పకుండా మార్చేసు కుందును. కాని నేను యీ లోకానికి రావడం, ఆవిడ పై లోకానికి వెళ్లడం ఒకసారే జరిగా యనీ, మా అమ్మ మాట తీసెయ్య లేక పేరులో కొద్దిగా ఆవిడ యిష్ట ప్రకారం యిముడ్చాననీ మా నాన్నగారు నేను పెద్దయిన తర్వాత చెప్పారు. వెతే వెయ్యి విధాలయితే అందులో సినిమా వెఱ్ఱి ఒకటి.

మా నాన్నగారి మీద నాకు చాలా తప్పుడు అభిప్రాయాలుండేవి. అసలు కలకత్తా ఎప్పుడు వచ్చారో, ఎందుకొచ్చారో, ఏ ఉద్యోగం చేస్తున్నారో, ఆంధ్రా ఎందుకు వదిలేసారో ఎప్పుడడిగినా చెప్పే వారుకాదు. మాకు కారుంది. ఎంబాసడర్. మా యింట్లో వంట చెయ్యడానికి, యింటి పనులన్నీ చూడటానికీ ఒకావిడవుంది. మా నాన్నగారు ఆవిడతో మాట్లాడుతూంటే — అనకూడదు కాని— ఆయన మొరేలిటీ మీద నాకు అనుమానంవేసేది. 'అనకూడదు కాని' అంటూనే అనడం మనకొక దురలవాటు.

మా నాన్నగారు సాయంత్రం బార్— బి— క్యులో బ్రిజ్ ఆడి రాత్రి పడుకోబోయేముందు భగవద్గీత చదువుతూంటే ఒళ్ళు మండేది. (బ్రిడ్జ అని కొంతమంది అనడం విన్నాను గాని డిక్షనరీ గాని, కాన్వెంట్‌గాని నాకలా నేర్పలేదు.) షేక్స్‌పియర్ చదివిన తర్వాత నాకు జీవితం అంటే ఏమిటో తెలిసి వచ్చింది. షేక్స్‌పియర్ జీవితానికి డిక్షనరీ లాంటివాడు. సుఖం, దుఃఖం, ప్రేమ, పగ, అసహ్యం— ఒకటేమిటి ప్రపంచంలో ఉన్న మనుష్యులంతా విడివిడిగా అనుభవించినవన్నీ ఆయన ఒక్కడే అనుభవించినట్లు కనిపిస్తుంది షేక్స్‌పియర్ డ్రామాల్లో. మా నాన్నగారి మీద యిప్పుడు గౌరవం తప్ప మిగతా అభిప్రాయాలన్నీ పోయాయి. అందులో మొదటిది మా నాన్నగారి ఉద్యోగం గురించి. ఎవరితోనో చెబుతూంటే ఒకసారి విన్నాను — ఆయన ఏదో ఫర్మ్‌లో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో ఒకరు.

బ్రిజ్ ఆడివచ్చి భగవద్గీత చదువుతున్నారంటే తప్పేమీ లేదు. కాలం మారుతోంది గదా అని పూర్తిగా మారిపోనూ లేము, పూర్తిగా పాతవాటిని విడిచి పెట్టనూ లేము. పూర్వకాలం నుంచి నిన్నటి దాకా ఉన్న సంస్కృతి ఈ రోజు మన చేతల్లో కనిపిస్తుంది. కలకత్తా వచ్చి సౌత్ ఇండియన్ హోటల్ ఎక్కడని అడగటం లేదా? మీ గొప్పదనం ఏమిటి చెప్పమంటే నన్నయ, పెద్దన, త్యాగరాజు మన నాలుక చివరకు రారా? మా నాన్నగారు నిజంగా మంచి పని చేశారు. నన్నయనుంచి నేటి దాకా గల తెలుగు సాహిత్యంలో నాకు కొంత ప్రవేశం కల్పించారు. లేకపోతే నాకు జీవితంలో విలువలు మరొకలా ఉండేవి.

ముందు జరుగబోయే డ్రామాలో కొంత వరకు నా పాత్ర పాసివ్‌గా ఉంటుంది. ఆ తరవాత ప్రేక్షకురాలిగా కాక నేనూ ఒక పాత్ర తీసు కుంటాను.

* * *

ఒక రోజు నేను, మా నాన్నగారు కలిసి ఎలీట్‌లో సినిమాకు వెళ్లాం. పైకి వచ్చిన తర్వాత కార్లు ఆగి ఉన్నవైపు వెడుతున్నారు మా నాన్న గారు. "నాన్నా, మర్చిపోయారేమిటి? మనం యివాళ కార్లో రాలేదు" అన్నాను. "ఓహో" అని వెనక్కు తిరిగారు. మా కారు రిపేర్‌కు వెళ్లింది. కారు పార్ట్సులో ఎప్పటికప్పుడు ఏదో ఒకటి పాడైపోవడం కద్దు. నేను కాలేజ్‌కి ఎప్పుడూ సిటీ బస్‌లోనే వెళ్లేదాన్ని. ఆయన ఆఫీసుకు కారు పాడైనప్పుడు టాక్సీలో వెళ్లేవారు. మాకసలు కారు అనవసరం అని ఎప్పుడూ అనుకునేదాన్ని. కాని డ్రైవింగ్ నేర్చుకున్న క్రొత్తలో ఆఫీసుకు తప్ప మరెక్కడికి వెళ్లాలన్నా నేనే డ్రైవ్ చేసే దాన్ని. ఆ సరదా పూర్తిగా తీరలేదు.

మా నాన్నగారన్నారు; "ఐతే టాక్సీలో పోదాం."

"ఇవాళ నాకు బస్సెక్కాలని ఉంది" అన్నాను నేను. ఇలాంటి కోరికలు నాలుగైదేళ్ల క్రిందటే వదిలెయ్యవలసిన సంగతి. చిన్నప్పటి కోరికలు బాగా పెద్దయిన తర్వాత రివైవ్ అవుతాయంటారు. నేను ఏ రోజూ కాంజే అటు పదేళ్లూ యిటు పదేళ్లూ గల మనిషిలా ప్రవర్తిస్తూండేదాన్ని.

"అమ్మాయ్, అనవసరంగా నన్ను కష్ట పెట్టేస్తున్నావ్" అన్నారు. 'కష్టమేముంది? మనలాంటి వాళ్ళు ఎంత మంది వెళ్ళడంలేదు బస్సుల్లో' అనుకున్నాను సోషలిస్ట్‌లా. పైన చెప్పిన చంచలత్వంలో యిది కూడా చేర్చవచ్చు. క్షణంలో సోషలిస్ట్. మరుక్షణంలో బూర్జువా. బూర్జువాకు వ్యతిరేకపదం కమ్యూనిష్టనుకుంటాను. 'సోషలిజానికీ, కమ్యూనిజానికీ మాత్రం తేడా తెలుసుకోవాలి. మా నాన్నగారెటో చూస్తూ నడుస్తున్నారు. ప్రతిదాన్నీ అతి జాగ్రత్తగా పరిశీలించడం ఆయనకు అలవాటు.

"ఇవాల్టికి బస్సులో పోదాం" అన్నాను. పెద్దవాళ్ళు తమ దృష్టిలో కాకుండా కుర్రవాళ్ళ దృష్టిలో ఆలోచించాలనుకునే వాళ్ళల్లో మా నాన్న గారొకరు.

బస్సు స్టాప్ వైపు నడుస్తున్నాం.

"అమ్మాయ్, తెలుగతనెవరో బస్సుకోసం పరుగెడుతున్నాడు చూడు" అన్నారు. అట చూశాను. కొంత దూరం నుండి చూస్తున్నాం గనుక అతన్ని వర్ణించడానికి రెండు వాక్యాలు చాలు. మనిషి సన్నగా ఉన్నాడు. వంటి ఛాయ బాగా తెలియడం లేదు; జుట్టు వ్యవస్థ కూడా అంతే. చారల పొడుగు చేతుల చొక్కా, డ్రేన్ పైప్ పాంట్, సూదిగా ఉన్న బూట్స్. ఆశ్చర్యం, మనవైపు వెడల్పు పాంట్స్, వెడల్పు షూస్ యిప్పటికీ వేస్తున్నారని విన్నాను! దీన్ని బట్టి రెండు రకాలుగా చెప్పవచ్చు. ఒకటి, అతను తెలుగువాడు కాకపోయుండాలి. రెండు, ఒకవేళ తెలుగతనే ఐయుంటే కనీసం ఒక ఏడాది బట్టైనా యిక్కడ వుండి ఉండాలి. రెండోదే కరెక్టయితే మానాన్నగార్ని జేమ్స్‌బాండ్‌తో పోల్చవచ్చు. కాని జేమ్స్ బాండ్‌కు 'గాల్స్', గన్స్' ఉంటేగాని లాభంలేదు. గనుక షెర్లాక్ హోమ్స్‌తో పోలుస్తాను. మా నాన్న గారు కానన్ డయల్ ఎక్కువగా చదువుతూ ఉంటారు.

బస్సు ఆగిన మరుక్షణంలోనే కదిలింది; ఎప్పుడాగిందో, ఎప్పుడు కదిలిందో చెప్పలేం గాని వంద మంది దిగడం, అంతకంటె ఎక్కువ మంది లోపల ప్రవేశించడం జరిగాయి. అతను పేవ్‌మెంట్ మీద పరిగెడుతూంటే కాలు జారింది. కాలు జారడ మేమిటి? బూట్ జారింది. ఐనా అతను క్రింద పడకుండా నాలుగడుగుల దూరం దాకా అలాగే జారి నిలబడ గలిగాడు. నేరో షూస్‌తో జాగ్రత్తగా నడవాలి. మేము హై హీల్స్‌తో కష్టపడటం లేదు!

అతనికి బస్సు అందలేదు. మేమిద్దరం స్టాప్ సమీపించాం. మానాన్నగారు అతనివైపే నడవడం చూసి నేనూ అటేనడిచాను.

"మీ పేరేమిటో తెలుసుకోవచ్చా?" అన్నారతనితో ఇంగ్లీషులో.

"మిస్టర్ రావ్. వరప్రసాదరావు" అన్నాడతను. మానాన్నగారు నా వైపు తిరిగి.

"చూశావా అమ్మాయ్, యితను తెలుగు వాడని చెప్పానా లేదా?" అన్నారు.

"ఓ మీరు తెలుగువారా?" అన్నాడతను.

శుద్ధ తెలుగులో మాట్లాడుతూంటే 'తెలుగువారా?' అని ప్రశ్నేమిటీ?

మా నాన్నగారన్నారు "వేరే చెప్పాలా? ఏం ఉద్యోగం చేస్తున్నావోయ్!"

"ఐ. ఎస్. ఐ. లో ఉన్నానండి. ఐ. ఏ. ఎస్. పరీక్షకు వెడదామనుకుంటున్నాను."

"వెడదామనుకుంటున్నావా? ఐతే ఫరవాలేదు. ఒకటి రెండు సార్లు వెళ్ళి వచ్చిన వాళ్ళంటే నాకు భయం. వాళ్ళు అన్ని విషయాల మీదా ఏదో ఒకటి మాట్లాడగలరు."

మానాన్నగారు మాట్లాడు తూంటే నేనతన్ని పరిశీలనగా చూశాను. సన్నగా ఉన్నా స్మార్ట్‌గానే ఉన్నాడు. వర్ణం తెలుపుకు దగ్గర. కొద్దిగా వంపులు తిరిగిన జుట్టు. వేళ్ళు సన్నగా తెల్లగా ఆడవాళ్ళ వేళ్ళలా ఉన్నాయి. ఎడంచేతి వేళ్ళకి గోరింటాకు ఎర్రగా ఉంది. ఇదెక్కడి సరదా?

మానాన్నగారు అన్నది కూడా వింటున్నాను. అవకాశం దొరికినప్పుడల్లా ప్రతిదాని మీదా తన అభిప్రాయాన్ని వ్యక్తపరచడంలో మా నాన్నగారు

ఘనులు. లేకపోతే యిప్పుడిదెందుకు? ఈ విధంగా అనుకుంటూంటే నాకు నవ్వు వచ్చింది. నేను నవ్వడం మూలంగా అతనేదో అనబోతూ ఆగాడు. అతడు మాట్లాడబోతూ ఆగడం మూలంగా మా నాన్నగారు నావైపు చూశారు. చూసి "అరెరె, మా అమ్మాయిని యింతసేపూ పరిచయమే చెయ్యలేదు నీకు,— కిరణ్మయి. బి. ఏ. కలకత్తా యూనివర్శిటీ." అతను చేతులు జోడించ బోతూంటే హౌ డు యు డూ" అన్నాను. అతని ముఖంలో కన్పించిన ఆశ్చర్యం వర్ణించలేను. కొంత బెరుకుగా, కొంత భయంగా, కొంత తీక్షణంగా ఉన్న చూపుల్ని తట్టుకోవడం కొంచెం కష్టమయింది. ఒక చిరునవ్వుతో పరిచయం ముగిసింది. హక్కుల మాట అటుంచి తనకంటె తక్కువ వయస్సుగల స్త్రీని పలుకరించ వలసి వచ్చినప్పుడు ఆమె కంటె ముందుగా ఏ పురుషుడూ నమస్కారం పెట్ట కూడదు. మిగతా పలుకరింపులలో ముందు వెనుకలు ఒకరిమీద మరొకరికి ఉన్న గౌరవమే నిర్ణయిస్తుంది. ఈ విషయం యువకులంతా తెలుసుకోవాలి. అతనికి యిరవై రెండు లేక యిరవై మూడు సంవత్సరాలు ఉండవచ్చు. వయస్సులలో తారతమ్యం అట్టే తెలియడం లేదుగనుక యిద్దరం ఒకేసారి చేతులు జోడిస్తే సభ్యతగా ఉంటుందని అతను భావించాడని తోచింది. నేనిలా ఆలోచిస్తూంటే మా నాన్నగారన్నారు.

"ఈ రోజుల్లో యువకుల్లో చొరవ బొత్తిగా లోపించింది. ఉదాహరణకు మిస్టర్ వరప్రసాదరావు కేసే తీసుకుందాం. ఏదో ముసలివాణ్ణిగదా; మతిమరుపు ఎక్కువగా ఉంటుంది గదా ; వయస్సు మళ్లిన వాళ్లు మాట్లాడడం మొదలు పెడితే ఆగరని తెలుసు గదా, మరి ప్రసాదరావు 'అయ్యా, మీరు మీ అమ్మాయిని పరిచయం చెయ్యలేదని అడగాలా వద్దా? చొరవ లేకపోతే అరువు తెచ్చుకోవాలి. అరువు తెచ్చుకున్నట్టు తెలియకూడదు. నటించాలి. అతి, అఫ్ కోర్స్, సర్వత్ర వర్జయేత్— ఏమంటావోయ్ రావ్!" —మా నాన్నగారు ఏభయ్యోపడిలో ముసలివాణ్ణని చెప్పుకోవడం మొదలు పెట్టారు. చూడ్డానికి మాత్రం నలభై లోపు వయస్సుగల వారిలాగే కనపడతారు. 'ఈ కాలపు కుర్రవాళ్లు', 'మా రోజుల్లో అంటే' మొదలైనవి ఎప్పుడైతే అంటారో అప్పుడే పెద్దవాళ్లయి పోతున్నట్లు సూచనట. 'గుర్రపు పందాల్లో ఏదైనా గుర్రం కొంతవరకూ పరుగెట్టి వెనక్కు తిరిగి మిగతావి ఎంత దూరంలో ఉన్నాయో చూసినా — లేక ప్రక్కనేదేనా పచ్చికబీడు కనిపిస్తే విశ్రమించడానికి ఆగినా ఆ గుర్రాన్ని ఏం చేస్తాం?' అని అడిగారు ఒకసారి. 'తీసేస్తాం' అన్నాను.

ఆ తర్వాత సంభాషణ అట్టేసేపు జరుగలేదు. మా నాన్నగారు మా అడ్రస్ అతనికిచ్చి మర్నాడు సాయంత్రం తప్పకుండా రమ్మనిచెప్పారు. అలాగేనని అతను బస్సెక్కి వెళ్లిపోయాడు.

* * *

రెండో సీను మా యిల్లు. సాయంత్రం. నాలుగయింది. టీ టైమ్. మా నాన్నగారు, నేను వరప్రసాదరావు కోసం ఎదురు చూస్తున్నాం. మా నాన్నగారు సామాన్యంగా ఎవర్నీ ఎక్కువగా యింటికి రమ్మని పిలవరు. స్నేహితు లెవరైనా సాయంత్రం వేళ వచ్చేవారు. కాని క్రొత్తగా పరిచయం అయిన వాళ్లనెవర్నీ పిలవడం అలవాటు లేదు. పరిచయం ఐన వెంటనే స్నేహంలోకి మారిపోకూడదనీ, ఒక దానిలో నుండి రెండో దానిలోకి ప్రవేశించడానికి కొంతకాలం పట్టాలనీ అనేవారు. అందులోనూ ఒకసారి కనిపించిన మనిషి మళ్లీ ఎక్కడా కనిపించనపుడు (పెద్ద పట్టణం కావడంమూలాన) ఎంతమందితోనని పరిచయం పెంచుకుంటాం? అనేవారు. అయితే వరప్రసాదరావులో ఏం చూసి ఇంప్రెస్ అయ్యారో? అతని డ్రస్‌లో సాఫిస్టికేషన్ ఉన్నా మాటల్లో సాఫిస్టికేషన్‌లేదు. ఇంకా అతన్ని గురించి తెలిస్తేగాని అభిప్రాయాలేవీ ఏర్పరుచుకోకూడదు. మనుష్యులు రెండు రకాలు. కొందరిమీద మొదట్లో మాట్లాడినప్పుడు ఎంత మంచి అభిప్రాయం కలుగుతుందో, రాను రాను పరిచయం ఎక్కువైన కొద్దీ వాళ్లమీద గౌరవం తగ్గిపోతుంది. మరి కొందరితో పరిచయం దీనికి

వ్యతిరేకంగా ఉంటుంది. మొదట్లో ఎక్కువగా మాట్లాడా లనిపించక పోయినా తర్వాత తర్వాత వాళ్లు ఎంతో కల్చర్డ్ అనిపిస్తుంది. కల్చర్ ఉంటే చాలు, సాఫిష్టికేషన్ అనవసరం.

మెట్లమీద చప్పుడయింది. తలుపు తోసు కుని "మే ఐ కమిన్" అంటూ లోపలకు వచ్చాడు వర(ప్రసాదరావు.

"ఒక్కసారి అలా ఆగవోయ్" అన్నారు మా నాన్నగారు ఎడం చెయ్యి కొద్దిగా పైకెత్తి. అతనెంత ఆశ్చర్య పోయాడో, నేనూ అంతే ఆశ్చర్య పోయాను. మా నాన్నగారు అన్నారు:

"మరేం లేదులే. నువ్వు అలాగే నిలబడి ఉండు. నువ్వు (ప్రవేశించిన తీరు వర్ణిస్తాను."

అతను (ప్రవేశించిన తీరెలా ఉన్నా అతని తీరు మాత్రం నిన్నటికీ ఈ రోజుకూ చాలా తేడాగా ఉంది. నిన్నటి (డేన్ పైప్ స్థానే వెడల్పు పాంట్ ఉంది. బుష్‌షర్టు కూడా కొద్దిగా వదులుగా ఉంది. షూస్ కూడా మారాయి. నేను అతన్ని చూస్తూంటే అతను మా నాన్నగారివైపు చూస్తున్నాడు. మా నాన్నగారన్నారు:

"అలనాడు మంచు కొండల మీద కాలి పసరు ఆరిపోగా అటూ యిటూ తిరుగుతూ వరూధినిని చూసి బిత్తరగా ఆమె ఉన్న సౌధంలో (ప్రవేశించిన (ప్రవరాఖ్యునిలా ఉన్నాడు యీ నాటి వర(ప్రసాదరావు. లేక, యూపిఎస్సీ ఇంటర్వ్యూ మెంబర్స్ ముందుకు కాళ్లు వణుకుతూ వెళ్లే విద్యార్థిలా ఉన్నాడు. వర్ణనలు రెండు చాలు. ముందు యివి టీ (తాగుతూ అరిగించుకుంటే మిగతావి చూద్దాం. అందుచేత, రావ్, వెల్‌కమ్. ఇలా కూర్చో."

మే మిద్దరం విష్ చేసుకున్న తర్వాత అతను సోఫాలో కూర్చున్నాడు. మొదట్లో మా నాన్నగారితోనే ఎక్కువగా మాట్లాడినా నాతో కూడా తర్వాత చాలా (ఫ్రీగా మాట్లాడటం మొదలు పెట్టాడు. మా నాన్నగారు మొదట్లో అతని పుట్టుపూర్వోత్తరాలన్నీ అడిగేసారు. ఇది పెద్ద వాళ్లందరికీ ఆనవాయితే. తర్వాత కాసేపు అతని ఎడ్యుకేషన్ గురించి మాట్లాడుకున్నాం. సంభాషణ జరుగుతున్నంత సేపూ నేను ముఖ్యంగా గమనించి నది — అతను నా పేరుతో చాలా తికమక పడి పోతున్నాడని. 'సుచి(త్రగారూ' అని, 'కిరణ్మయి గారూ' అని — ఏదీ కుదరడం లేదు. నేనన్నాను:

"నాన్నా, (ప్రసాద్‌గారు నాపేరు పలకడానికి చాలా కష్టపడి పోతున్నారు. అందుచేత పిలవ డానికి సులువుగా ఉండేలా ఒకపేరు చెప్పండి",

"అమ్మాయ్, నువ్వు యిలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తున్నట్లు నేను ఎప్పుడో గమనించాను. కాని అతని వల్ల యింకొక పేరు కావాలంటున్నావు గనుక ఆ పనేదో రావే చేస్తాడు. ఏమోయ్ రావ్, ఆలోచించు" అన్నారు.

"రేణు అని పిలిస్తే బావుంటుందని తోస్తోందండి" అన్నాడు (ప్రసాదరావు.

"మా అమ్మాయికి అభ్యంతరం లేకపోతే నువ్వీరోజు నుంచీ అలాగే పిలవవచ్చు."

నేనన్నాను! "వాటీజ్ ఇన్‌ఏ నేమ్! (ప్రసాద్ గారికి నా అనుమతి యిచ్చేస్తున్నాను."

నాకు టీ సంగతి గుర్తొచ్చింది. "నాన్నా మనం టీ సంగతే మర్చిపోయాం" అన్నాను.

"నిజమే. రావ్, నీకు టీ కావాలా కాఫీ కావాలా?" అనడిగారు.

"నాకు కాఫీ యిష్టం లేదండి."

"సజాతి వాడివే. నాకూ యిష్టంలేదు. అమ్మాయ్, నువ్వు మరేమీ అనుకోకపోతే టీ తీసుకురా. రావ్, యీ టీ తో వచ్చిన గొడవంతా ఏమిటంటే వేళకి పడకపోతే మార్చి నెలలో కుందేళ్లా కిందా మీదా నిలవలేం" అన్నారు మా నాన్నగారు.

నేను లోపలికి వెళ్లబోతూ "ఏమిటి నాన్నా, ఆ కుందేలు కథ" అన్నాను.

"కుందేళ్లకి మార్చిలో (బ్రీడింగ్ సీజన్‌లే. అప్పుడు పిచ్చెత్తినట్టు తిరుగుతాయట" అన్నారు.

కెటిల్, కప్పులు, సాసర్లు తీసుకొచ్చాను. నేను టీ కలుపుతూంటే (ప్రసాదరావు రూమ్

ఎలా ఉందోనని చూస్తున్నాడు. ఫ్లవర్ వేజ్, గోడ మీదగల పెయింటింగ్స్, డోర్ కర్టెన్, పుస్తకాల షెల్ఫుమీదుగావచ్చి అతని ప్రక్కనే ఉన్న టేబుల్ మీద ప్రసాదరావు దృష్టి ఆగింది. ఆ టేబుల్ మీద ఫోను, టేబుల్ లైట్ కాకుండా ఒక డబుల్ ఫోటో — ఫ్రేమ్ కూడా ఉంది.

"ఎవరండి యీ మార్గరెటా ఆర్విడ్‌సన్" అన్నాడతను ఫోటో ఫ్రేమ్ తన చేతిలోకి తీసుకొని ఫోటో క్రిందనున్న పేరుచూసి.

"అది ఐ.ఏ.ఎస్. క్వెశ్చనోయ్. మిస్ యూనివర్స్. నేనొకటి చెప్పాను గనుక నువ్వు ఆ రెండో ఫోటో ఎవరిదో తేలిగ్గా చెప్పెయ్యగలిగి ఉండాలి. ఆవిడ పేరేదో మర్చిపోయాను. చదువు."

"యాస్మిన్ డాజీ. నేచురల్లీ మిస్‌ఇండియా. ఐనా యీ ఫోటోలెందుకండి యిక్కడ?"

"మరే ఫోటోలుండాలి. మా అమ్మాయి మిస్ ఇండియా కంటెస్ట్‌కు వెళ్లిందిలే."

అతను నావైపు ఆశ్చర్యంగా చూశాడు. మా నాన్నగారన్నారు:

"నేను ఇరవైరెండో ఏట ఒక ముఖ్యమైన విషయం నేర్చుకున్నాను — ప్రతిదానికీ ఆశ్చర్యపోకూడదని. ఉదాహరణకు నిన్నటికీ, ఇవాళ్టికీ నీ డ్రస్‌లో వచ్చిన విపరీతమైన తేడా చూసి మా అమ్మాయి నిన్ను చాలా ఆశ్చర్యంగా చూసింది. నేను ఆశ్చర్యపోలేదు. ఎందుచేత? నువ్వు పేవ్‌మెంట్ మీద జారడంచూసి ఆ షూస్ కొత్తగా వేసుకున్నావని అనుకున్నాను. నీకు నేరో షూస్ కొత్తగనుక నేరో పాంట్ కూడా కొత్తని భావించడంలో తప్పులేదు. నీకు నేరో పాంట్ ఒకటి ఉంది. నిజమేనా?"

"నిజమే."

"దీనిమీద యింకా మాట్లాడుదామనుకున్నాను గాని మా అమ్మాయి తనలో తనే నవ్వుకుంటోంది. అందుచేత టాపిక్ మార్చేద్దాం. ఐ. ఏ. ఎస్. లో నీ పేపర్లేమిటి?"

"మాథ్‌మాటిక్స్ ఒకటండి."

"లెఖ్ఖలా? కూడిక చెయ్యగలవా? లూంయిస్ కెరాల్‌లా ప్రశ్నలు వేస్తాను. సమాధానం చెప్పు. ఒకటి ప్లస్ ఒకటి ప్లస్ ఒకటి ప్లస్ ఒకటి ప్లస్ ఒకటి ఎంత?"

"అబ్బే ఎన్ని ఒకట్లో లెఖ్ఖపెట్టుకోలేదు."

"ఎవరు లెఖ్ఖపెట్టుకోవద్దన్నారు? ఇంకో ప్రశ్న. తిరుగుబాటుకూ విప్లవానికీ తేడాఏమిటి?"

ప్రసాదరావు కొంతసేపు ఆలోచించి "తేడా ఏమీ కనిపించడం లేదండి" అన్నాడు.

"తేడా ఏమీ లేకపోతే రెండుపదాలెందుకు? ఇవి రెండూ పర్యాయ పదాలు కావుగదా! రేపు ఇంటర్వ్యూలో యిలాంటి ప్రశ్నలే వేస్తారు. ఇలాగే ఎన్నైనా అడగ వచ్చు. ఉదాహరణకి మీదేవూరు?"

"గుంటూరు."

"ఆ పేరెందుకు వచ్చింది?"

"ఊహుం ఎప్పుడూ ఆలోచించలేదండి."

"ఎవరు ఆలోచించ వద్దన్నారు? అన్నట్టు గుంటూరు వైపు యింకా కారం ఎక్కువగా తింటున్నారా?"

"ఆహా, తింటున్నామండి."

"కారం ఎక్కువగా తినేవాళ్లకు కోపం ఎక్కువగా ఉంటుంది. అయినా, మీ వాళ్లతో చెప్పు— 'కారం ఎక్కువ' రెండు విధాలు. ఒకటి, ఉప్పు తక్కువ అవడం మూలంగాను, రెండు, నిజంగా కారం ఎక్కువ అవడం చేతను. మా బావగారొకాయన ఉండేవాడు. ఒక రోజు కూరలో కారం ఎక్కువైందన్నాడు. కొద్దిగా ఉప్పు కలుపుకోమన్నాను. కారం తగ్గిపోయిందన్నాడు. ఈ ఉప్పు టేస్టు మీ వాళ్లందర్నీ చేసి చూడమని చెప్పు."

"దీని మీద గోదావరి మండల వాసులు, గుంటూరు మండల వాసులు ఎప్పుడూ వాదించుకుంటూనే ఉంటారుగదా!" అన్నాడు ప్రసాదరావు.

"అదే, వాదించడానికి ఎవరూ దొరక్క మనలో మనమే వాదించుకుంటాం. సరిగ్గ

యిందుకే మనం ఆంధ్రాలో కంటె బయట ఐకమత్యంగా ఉంటాం.''

''ఏ స్టేట్ వాళ్ళేనా అంతేనండి.''

''నిజమేననుకో. ఇంతకూ యిక్కడికి వచ్చే టప్పుడు మీ ఫేమస్ గోంగూర పచ్చడి తెచ్చు కున్నావా?''

''తీసుకొచ్చానండి.''

''ఆంధ్రా వదిలేసినా గోంగూర పచ్చడేమి టోయ్'' అన్నారు మా నాన్నగారు నవ్వుతూ.

''ఆంధ్రా వదిలేస్తే మాత్రం! గోంగూర పచ్చడి మర్చిపోయిన వాడు ఆంధ్రుడా?'' అన్నాడు ప్రసాదరావు.

ముగ్గురికీ ఒకసారే నవ్వు వచ్చింది. సంభా షణ మొదట్లో ఎలా ఉన్నా క్లయిమాక్స్ చేరే సరికి గొప్పవిషయం చెప్పాడనిపించింది. ప్రసాద రావును పైనచెప్పిన రెండురకాల మనుషుల్లో కేటిగరీ టూ లో వెయ్యొచ్చని తోస్తోంది.

మా నాన్నగారు అతన్ని ఆ రోజు మా యింట్లోనే భోజనం చెయ్యమన్నారు. ససేమిరా చెయ్యనన్నాడు ప్రసాదరావు.

* * *

మర్నాడు మళ్లీ సాయంత్రం నాలుగు దాటిన తర్వాత టీ టేబుల్ దగ్గర కూర్చొని ముగ్గురం కబుర్లు చెప్పుకుంటున్నాం. నేను మా నాన్నగారితో అన్నాను

''నాన్నా, నాదొక ప్రపోజల్. ఈ రోజు నుండి ప్రసాదరావుగారు నన్ను బహువచనంలో సంబోధించడం మానేస్తారు.''

మానాన్న గారన్నారు:

''అలాగే. నాకన్న నువ్వే నయం. మొదటి రోజునే అతని అనుమతి లేకుండా నేను సింగ్యులర్ లో సంబోధించడం మొదలు పెట్టాను. యథాపితాః — కుదర్లేనట్లుంది, —నాలాగే అతను కూడాను.''

ప్రసాదరావు సరేనన్నాడు.

మా నాన్నగారన్నారు: ''ఈ రోజు ఏమైనా నవ్వు మా యింట్లోనే భోజనం చెయ్యా లోయ్''

''నా కెవరింట్లోనూ భోజనంచేసే అలవాటు లేదండి.''

''నువ్వు హాస్టలుకు వెళ్లిపోవడానికి ఆలస్యం చెయ్యనులే. నువ్వు రోజూ ఎన్నింటికి భోజనం చేస్తావో చెప్పు. డిన్నర్ అవగానే వెళ్లిపోదువుగాని.''

''నేను రెగ్యులర్‌గా ఏడింటికి భోజనం చేస్తూ ఉంటానండి.''

''మంచిది. నెలకు ఎన్నిసార్లు వెడుతూ ఉంటావు డాక్టరు దగ్గరకు? రెగ్యులర్ అంటే ఏడింటికి, ఏడుగంటల మూడు నిముషాలకీ తినాలని కాదు. మధ్యాహ్నం రెండింటికి భోజనం చేసి, మూడింటికి టిఫిన్ చేసి రాత్రి తినడం మానేసి పడుకో కూడదని.''

''అలవాట్లలో తేడాలుంటాయండి.''

''నిజమే. అలవాట్ల గురించి ఒక గంట సేపు మాట్లాడగలను. కాని మనలో చాలామందికి ఏ విషయంమీద ఎంతసేపు మాట్లాడాలో తెలియదు. నే నీమధ్య ఆ జాతిలోకి వెడుతున్నానని అనుమానం వేస్తోంది. అందుచేత మనం యీ విషయం యిక్కడికి అపుజేసి, మా కారు రిపేరులో నుండి వచ్చింది గనుక, మనం అలా చౌరంఘీ వైపు వెళ్లొద్దాం. నువ్వు స్మార్ట్‌గానే ఉన్నావు గాని జుట్టు చెరిగిపోయింది. దువ్వుకో. బయల్దే రుదాం'' అన్నారు.

అతను దువ్వుకుంటూంటే మా నాన్నగారు అన్నారు. ''జుట్టు మరీ సీట్‌గా వెనక్కు దువ్వేస్తే. వేమిటోయ్! బీటిల్ ఉన్న సినిమా ఏదీ చూడ లేదేమిటి? లేక బీట్నిక్స్‌లో చేరిపోతున్నావా?''

''బీట్నిక్స్ ఎవరండి?'' అన్నాడు ప్రసాదరావు.

''ముందు బీటిల్స్, ఎవరో తెలుసునా?''

''అది ఎవరికేనా తెలుస్తుంది లెండి. బీట్నిక్స్ ఎవరో తెలియదు.''

"నాకూ అంత బాగా తెలియదనుకో. ఈ రోజుల్లో అర్థం తెలియకపోయినా పదాల్ని ఎంత మంది వాడటం లేదు? ఎక్కడో చూశాను. వీళ్లకు వ్యతిరేకం వాళ్లనుకుంటాను. మా అమ్మాయికి యింకా తెలుసునేమో! ఏ మమ్మా రేణూ? (ప్రసాద రావుతో) నువ్వు యిప్పటి కొక్కసారీ రేణూ అని పిలవలేదు గనుక అలవాటు చేస్తున్నాను."

నేనన్నాను: "అమెరికాలో బీట్ జనరేషన్ అని ఉంది. వాళ్లకి యీ నాటి సంఘం అంటే అంత యిష్టంలేదు. ఒక సెంచరీ వెనకాల రావాలని వాళ్ల ఉద్దేశ్యం అనుకుంటాను."

"మన యువకులు మోడర్నిటీకి పదేళ్లు వెనకాల వస్తున్నట్లు. మనం యిలా మాట్లాడు తూంటే రావు తనకు బైమై పోయిందని హాస్టలుకు వెళ్లిపోవచ్చు. నేను రెడీ" అన్నారు.

అలవాటు ప్రకారం నేను కారు డ్రైవ్ చేస్తున్నాను. ఎస్ప్లనేడ్ వైపు వెడుతున్నాం. గాలి లేదు. ఒకటే ఉక్క బోస్తోంది. ఎండలు మొదలవు తున్నాయి గనుక సాయంత్రాలు చాలా విసుగ్గా ఉంటున్నాయి. మా నాన్నగారు బయటకు చూస్తూ "సాయం సమయాన్ని వర్ణించగలవుటోయ్" అన్నారు.

ప్రసాద్ అన్నాడు "ఎలా చెప్పమంటారు? ఒకలా చెప్పగలను. భూమి మీద వున్న మనిషి భూమితో బాటుగా తిరుగుతూ సూర్యరశ్మి మేఘాల మీద పడి....."

"జాగ్రఫీ వద్దు. మరోలా చెప్పు."

"విక్టోరియా మెమోరియల్ దగ్గర ప్రజలంతా సేదదీర్చుకునే మూడు గంటల కాలం."

"ఇంకొకటి."

"ఈ రోజుల్లో విద్యార్థులు ఇరవై నాలుగు గంటల్లో మెలకువగా ఉన్న కాలంలో ఎలా వినియోగ పరచాలో తెలియక అవస్థపడుతున్న మూడు గంటల కాలం."

"మూడు గంటలేనా? రోజంతా యిదే అవస్థని నేననుకుంటున్నాను. అమ్మాయ్, కారు పార్కింగ్— ప్లేస్‌లో ఆపు. మనం కాస్త డ్రింక్స్ తాగి లాన్స్‌లో కూర్చుందాం." అన్నారు.

కారు పార్క్ చేశాను. మా నాన్నగారు ముందు దిగి డ్రింక్స్ స్టాండ్ దగ్గరకు వెళ్లారు. మే మిద్దరం వెనకాల నడుస్తున్నాం. మా నాన్న గారు వెనక్కు తిరిగి "కోక్స్ తాగుతారా, మరే దేనా కావాలా? అమ్మాయ్" అన్నారు.

"కోక్సంటే ?" అన్నాడతను నా చెవిలో.

"కోకాకోలాకు మరో పేరు" అని, మా నాన్నగారి వైపు తిరిగి అన్నాను: "ఆయనకిది యిష్టం లేదుట. ఆరెంజ్ తీసికోండి."

డ్రింక్స్ తాగిన తర్వాత కొంతసేపు లాన్స్‌లో కూర్చున్నాం. చీకటి పడుతూండగా ప్రసాద్‌ను వాళ్ల హాస్టల్ దగ్గర డ్రాప్‌చేసి మా యింటికి చేరుకున్నాం.

*　　*　　*

కోక్స్ గురించి నన్ను అడగటంలో ప్రసాద్ నన్ను కాన్ఫిడన్స్‌లోకి తీసుకున్న తర్వాత రెండు మూడు రోజుల్లో మే మిద్దరం కొద్ది కొద్దిగా చనువుగానే మాట్లాడుకుంటున్నాం. ఒక వారం దాటిన తర్వాత అనుకుంటాను మళ్లీ కారుమీద సాయంత్రం బయటికి వెళ్లాలని పించింది. మా నాన్నగారు ఏదో పనుందని మాయిద్దర్నీ వెళ్ల మన్నారు. ప్రసాద్, నేను కారులో వెడుతున్నాం. కలకత్తా కొత్త వాళ్లకే గాని పాతవాళ్లకి విసుగెత్తుతుంది. నియాన్ లైట్లు మొదట్లో ఎంత బావుంటాయో తర్వాత అటు చూడ బుద్ధికాదు. రోడ్డుమీద పోయే మనుష్యులురెండు రకాలు. స్త్రీలు, పురుషులు. నేను పురుషుల్ని చూస్తూంటే అతను స్త్రీలను చూడటంలో ఆశ్చర్యమేమీలేదు. ఈ వయస్సులో పిల్లలు, వృద్ధులు ఔటాఫ్‌సైట్.

అర్జునుడి గురిలా మాదృష్టి మాకు కావలసిన వాళ్లమీదే ఉంది.

ప్రసాద్ అన్నాడు: "రేణూ, నువ్వు చాలా అందంగా ఉంటావు. నిన్ను వర్ణించనా?"

"పొరవగా అడగటం నేర్చుకుంటున్నారా?— వర్ణించండి". అన్నాను.

"నువ్వు ఆధునికంగా ఉంటావు."

"ఇంకా "

"మాటలు చమత్కారంగా ఉంటాయి."

"ఇంకా"

"డ్రస్ మోడర్న్‌గా ఉంటుంది. నడవడి ఆధునికం, అలవాట్లు ఆధునికం, భోజనం ఆధునికం.

"వీటన్నిటికీ ఒక్కటే మాట ఉంది, చెప్పనా? సాఫిస్టికేటెడ్" అన్నాను దృష్టి అతనివైపు మరల్చి. అతను చిరునవ్వు నవ్వాడు.

"మీ నాన్న గారి గురించి కొంత చెప్పనా" అన్నాడు.

"చెప్పండి."

"మీనాన్నగారి మాటల్లో ఒక్కొక్కప్పుడు వేళాకోళం చేస్తున్నట్లు కనిపిస్తుంది."

"ఇంకా"

"ఒక్కొక్కప్పుడు డబాయిస్తున్నట్లు కనిపిస్తుంది. "

"ఆఁ"

"ఒక్కొక్కప్పుడు ఉడికిస్తున్నట్లు, మరొకప్పుడు తప్పు పడుతున్నట్లు, .........."

"వీటన్నిటికీ ఒక్కటే మాట ఉంది; చెప్పనా? నాగింగ్. చూశారా, తెలుగులో ఐదేసిమాటలకు ఒకటే ఇంగ్లీషు పదం చెప్పారు? అందుచేత ఇంగ్లీషును మించిన భాషలేదు.

"దేశభాషలందు తెలుగు లెస్స." అన్నాడు ప్రసాద్.

"విదేశభాషలందు ఇంగ్లీషులెస్స" అన్నాను మళ్లీ.

"ఇంతకూ మీకు డ్రైవింగ్ వచ్చునా?"అని అడిగాను.

"వచ్చును" అన్నాడు ప్రసాద్.

"అదే, యింతసేపూ చెప్పనేలేదేమిటి? డ్రైవింగ్ వీల్ పుచ్చుకోండి" అన్నాను.

అతను డ్రైవ్ చేస్తున్నాడు. బాగానే డ్రైవ్ చేస్తున్నాడు గాని ప్రతిజంక్షన్ దగ్గరా ఆగడమే. రెడ్‌లైట్ వెలగడం మాకారు జంక్షన్ సమీపించడం ఒకసారే జరుగుతున్నాయి. అదే ప్రాక్టిస్ ఉన్న వాళ్లయితే దూరంనుండే గమనించి రెడ్‌లైట్ వెలిగే లోపునే బాణంలా దూసుకు పోతారు. నేను కొద్దికొద్దిగా నేర్చుకుంటున్నాను. ఆరోజు ఆట్టే విశేషాలు జరుగలేదు.

* * *

తర్వాత సీను కొంచెం పెద్దది. సంభాషణల బట్టి ఒకరివ్యక్తిత్వం మరొకరికి తెలుస్తోంది గనుక నేను ప్రసాద్ గురించి ఏమనుకుంటున్నానో వ్రాయను. అతనితో ఎలా ప్రవర్తించేది చేతలే చెబుతాయి గనుక వేరే వివరించ నక్కరలేదని అనుకుంటున్నాను. ప్రసాద్ వచ్చి రెండు మూడు రోజులవుతోంది. ఆరోజు వర్షం పడుతోంది, ఎండలు కాస్తున్నా. రోజల్లా మానాన్నగారు, నేను ఎక్కడికీ వెళ్లలేదు. సాయంత్రం వర్షం వెలిసింది కాని మబ్బులు మాత్రం పోలేదు. ప్రసాద్‌వస్తా డేమో నని చూస్తూంటే అతను వచ్చాడు.

"తోచక చూస్తున్నామోయ్, రా" అన్నారు మా నాన్నగారు. "బయట అలా ఉంటే ఎక్కడికైనా ఎలా వెడతాముట? శాస్త్రకారు డేమన్నాడో తెలుసా? 'ప్రాతఃకాలే తుషారంచ, మధ్యాహ్నేచ మేఘ డంబరం, రాత్రౌ నిర్మలాకాశః, తద్దేశం పరివర్జ్యయేత్' అన్నాడు."

''మీకు సంస్కృతం బాగా వచ్చునా?'' అన్నాడు ప్రసాద్.

''రావాలేమిటి, ఏవో రెండు ముక్కలనడానికి? ఇవాళేమీ తోచడం లేదోయ్. ఏం చేద్దాం చెప్పు.''

''కార్డ్సు వేద్దాం'' అన్నాడు ప్రసాద్.

''టైమ్ విలువ తెలుసున్న వాడెవడూ పేకాడడు.'' నేనన్నాను: ''మీరు ఆడుతూంటారు!''

''నాకు టైమ్ విలువ తెలియదని భావం. మరో పని చేద్దాం. నువ్వు నన్ను ప్రశ్నలు వెయ్యి; సమాధానం చెబుతాను. తర్వాత నిన్ను నేను ప్రశ్నలు వేస్తాను; నువ్వు సమాధానం చెప్పు. మా అమ్మాయి మధ్యవర్తి — తర్కం సరిగ్గా ఉండకపోతే.''

''నాది ఒకటే ప్రశ్నండి. నేను తెలుగు వాణ్ణని మొదట్లో మీరు ఎలా చెప్పగలిగారు?

''అందులో కష్టమేముంది? మనందరికీ ముఖం మీద రాసి ఉండదటోయ్! ఢిల్లీలో సుబ్బారావు మెస్సులో మిగతా వాళ్లందరి కంటె గట్టిగా మాట్లాడేవాడు ఆంధ్రుడు. హౌరా స్టేషన్‌లో బుక్‌స్టాల్‌లో నువ్వు తెలుగు పుస్తకం మీద చెయ్యి వేస్తే నీ భుజం మీద చెయ్యివేసిన వాడు ఆంధ్రుడు. బొంబాయిలో స్నేహితుడెవరేనా దూరంగా కూర్చొని ఉన్నా అతనికి వినిపించేటంత గట్టిగా మాట్లాడేవాడు ఆంధ్రుడు. నాకు మెడ్రాస్ గురించి తెలియదు. బ్రహ్మ గనుక తన పరికరాలు నాచేతికిస్తే ఒక ఆంధ్రుణ్ణి చేసిపెట్టగలను.''

''ఏంతేనా మీకు ఆంధ్రులంటే తక్కువ అభిప్రాయం ఉంది.''

''అబ్బే, యిదంతా అభిమానమోయ్! ఈ రోజుల్లో మనల్ని మనం కించపరచుకోవడం ఒక ఫాషను. నీ ప్రశ్న అయిపోయింది గనుక నేనడుగుతాను. నీకు ఏ ఆట ఎక్కువ యిష్టం.''

''టెన్నిస్.''

''ప్రస్తుతం వింబుల్డన్ ఛాంపియన్ ఎవరోయ్?''

''సెంటానా.''

''సెంటానాకు నీకు ఒకటే పోలిక. ఇద్దరికీ వేళ్లు పెద్దవి. అందుచేత టెన్నిస్ ఆడటం మొదలు పెట్టు. తర్వాత ప్రశ్న. స్త్రీకి, పురుషుడికి తేడా ఏమిటి?''

నేనన్నాను: ''సెక్స్.''

''వెరీగుడ్. రావ్, మా అమ్మాయిని కూడా ఐ. ఏ. ఎస్. కు పంపించేస్తున్నాను. తర్వాత ప్రశ్నకు రేణు సమాధానం చెబుతుంది. అమ్మాయ్, రెండంకె తాలూకు ప్రాముఖ్యం ఏమిటి?''

''మనం ఎక్కాలు రెండో ఎక్కంతోనే ప్రారంభిస్తాం'' అన్నాను.

''ఇంకా ముఖ్యమైనవి— ప్రపంచంలోను, జీవితంలోను.'' ప్రసాద్ అన్నాడు. ''ఎక్కడేనా యీ రెండంకె ప్రత్యక్షమేగదా! సుఖం, దుఃఖం, మంచి, చెడు, తెలుపు, నలుపు యిలాగే అన్నీ.''

మా నాన్నగారన్నారు: ''వెరీగుడ్. ఒకళ్లను ప్రశ్నవేస్తే రెండోవాళ్లు సమాధానం చెబుతున్నారు. నేనింకా చెప్పనా? మనకు కాళ్లు రెండు, చేతులు రెండు, కళ్లు రెండు, చెవులు రెండు. చెవులు మూడెందుకుండ కూడదు? కళ్లు మూడెందు ఉండకూడదు? బ్రహ్మకి ఇనీక్వాలిటీస్ బాగా తెలుసును. ఒక కన్ను, జీరో కన్ను యిస్తాడుగాని మూడు మాత్రం యివ్వడు గదా!''

''శివుడికి తప్ప'' అన్నాను నేను.

''వాళ్లిద్దరిలో ఎవరు ముందో మనకు తెలియదు. అలాంటి విషయాల గురించి మాట్లాడటం మొదలు పెడితే రెండో నిముషంలోనే మనకు ఏం మాట్లాడాలో తెలియదు. అందుచేత మామూలు విషయాలికి వద్దాం. ప్రశ్నలైపోయాయి గనుక, — ప్రసాదూ, ఒక పాట పాడవోయ్. ప్రాస కుదిరింది గదా అని అడగడం లేదు సుమా!''

"నాకు రావండి."

"ఇదొక స్టాక్ అన్నరు. మా రోజుల్లో ఎవడు పాడమంటాడా పాడదామని చూసే వాళ్లం. ఇప్పుడూ అలాంటి ఉద్దేశ్యం చాలా మంది యువ కుల్లో చూస్తున్నాననుకో. అయినా ఎవరూ పాడ మని అడక్క అలాంటి వాళ్ల టాలెంట్ మరుగున పడిపోతుంది. పాటంటే గుర్తొచ్చింది. సెక్సర్ సైజులని ఎప్పుడేనా విన్నావుటోయ్!"

"లేదండి."

"ఈ మధ్య సినిమాల్లో, అలాంటివేవో చేస్తున్నారుట."

మా నాన్నగారు ఎప్పుడైనా తోచడంలేదని అంటే కథలు చెప్పమనడం నా కలవాటు. అందుకే "నాన్నా, ఏదేనా చిన్నకథ ఒకటి చెప్పండి" అన్నాను.

"చిన్న కథంటే కష్టమే. ఆ మధ్య ఎక్కడో చాలా చిన్న కథ ఒకటి చదివాను. చెప్పనా? రైలు పెట్టిలో యిద్దరే ప్రయాణం చేస్తున్నారు. 'నాకు దెయ్యాలంటే నమ్మకం లేదండి' అన్నాడు ఒకాయన రెండో ఆయనతో. 'ఆహా, అలాగా!' అని మాయం అయిపోయాడు రెండో ఆయన. ఇంతే కథ. అయినా యీ రోజుల్లో పేజీలు ఎన్ని ఎక్కువ రాస్తే అంత విలువ గదా, చిన్న కథలు ఎందుకు చెప్పు?"

"అయితే పెద్ద కథ ఒకటి చెప్పండి" అన్నాను.

"పెద్ద కథలు నీకు ఎక్కడపడితే అక్కడే దొరుకుతాయి."

"అయితే, చిన్నదీ పెద్దదీ కాని కథ ఒకటి చెప్పండి."

"రావు చెబుతాడు" అన్నారు మా నాన్న గారు. ప్రసాద్‌వైపు చూశాను. అతనన్నాడు:

"చెబుతాను కాని పూర్తిగా చెప్పేవరకూ మాట్లాడ కూడదు. చెప్పనా? పూర్వ కాలంలో ఒక రాజుండే వాడు....." నేను మధ్యలో "ఒక రాజే ఏం? చాలా మంది ఉండేవారు" అన్నాను.

"ఆ చాలా మందిలో యితనొకడని ఎందు కనుకో కూడదు? కండిషన్ దాటేశావు గనుక నేను చెప్పను."

ఆ రోజుకు కథ పూర్తవలేదు. మా మీటింగ్ మాత్రం పూర్తయింది.

*　　*　　*

మర్నాడు ప్రసాద్ రాలేదు. రెండు రోజులైనా రాలేదు. అతను లేకపోతే కొంతలోటు కనిపిస్తోంది. ఒక వారం దాటిన తర్వాత ఒక రోజు సాయంత్రం చీకటి పడుతూండగా వచ్చాడు. లోపలికి వస్తూంటేనే అన్నారు మా నాన్నగారు.

"రావోయ్, రా. ఈ వారం అంతా ఏం చేస్తున్నావ్?"

"ఏమిటో నండి. ఈ మధ్య లీజర్ దొరకడమే లేదు."

"రావ్, నువ్వు త్రేతాయుగం వాడివోయ్" అన్నారు మా నాన్నగారు.

"కాదండి, కలియుగంలో యిరవయ్యో శతాబ్ది వాణ్ణి."

"అయితే, యిరవయ్యో శతాబ్దపు డిక్షనరీ ఎప్పుడేనా చూస్తే లీజర్ అనడం మానేశారనీ లెజర్ అంటున్నారనీ...."

"డిక్షనరీ చూడటమంత బోర్ మరొకటి లేదండి."

"ఉంది. చూడకపోవడం."

నెపోలియన్ III యుద్ధాలెప్పుడొచ్చినా ఒక పీస్‌కాంగ్రెస్‌తో తయారయ్యే వాడుట. ఇప్పుడు యుద్ధమేదీ జరుగలేదు గాని నెపోలియన్‌లా

నాకూ ఒక ఫేవరిట్ ఉంది — ప్రపోజల్. అన్నాను.

"నాన్నా, నాదొక ప్రపోజల్. ప్రసాద్‌గారు యివాళ ఆలస్యంగా వచ్చారు గనుక, డిన్నర్ సిద్ధమయింది గనుక మనింట్లోనే భోజనం చేస్తారు."

ప్రసాద్ "అలాగే" అన్నాడు.

"ఆశ్చర్యం! విపరీతం! — అయినా ఒకటిలే. ఫేర్ సెక్స్‌తో ఫేర్‌గా బిహేవ్ చెయ్యాలన్నారు. ఆ సూత్రం పాటించినందుకు చాలా సంతోషం. ఇంకొకటి. మనం లేద్దాం. ఆలస్యాదమృతం విషః. ఈ రోజుల్లో నిముష నిముషానికీ మన ఐడియాస్ మారి పోతున్నాయి. రావ్‌కి హాస్టల్ గుర్తుకొచ్చే లోపల డిన్నర్ సర్వ్ చేసెయ్యాలి" అన్నారు మా నాన్నగారు.

భోజనం చెయ్యగానే ప్రసాద్‌తో టెరిస్ (కొంతమంది తప్పుగా టెర్రేస్ అంటారు) మీదకు వెడదాం అన్నాను. ఇద్దరం పైకి వెళ్లి కూర్చున్నాం. వెన్నెల. చాలా చక్కగా ఉంది. ప్రక్కగా పూల మొక్కలు. ఆ ప్రక్కగా లతలు. గోడమీద వాలుతూ కొబ్బరిచెట్టు ఆకులు. నల్లని నీడలు. మధ్య మధ్యలో తెల్లని కాంతి. సీను మామూలే. ఏసినిమాలో చూసినా వెన్నెల సీను అలాగే ఉంటుంది.

"నిన్ను కొన్ని ప్రశ్నలు వెయ్యనా?" అన్నాడు ప్రసాదరావు.

ఎలాంటి ప్రశ్నలో ననుకుంటూ, "వెయ్యండి" అన్నాను.

"మొదటి ప్రశ్న. ఆడవాళ్లు గాజులెందుకు వేసుకుంటారు?"

"మానేస్తున్నాం గదా!"

"రెండు. బొట్టెందుకు పెట్టుకుంటారు?"

"అదీ మానేస్తున్నాం గదా!"

"మానేస్తున్నారు సరే. మానెయ్యని వాళ్ల సంగతి చెప్పు."

"మునుపేమో రిలిజన్ కోసం బొట్టు పెట్టుకునే వాళ్లం. తర్వాత తర్వాత అది ఫాషన్ గానే మిగిలింది. గాజు లెందుకంటే ఏం చెప్పను? మీకు మీసం ఎందుకు? రిస్ట్ వాచ్ ఎందుకు? బట్ట లెందుకు? జుట్టెందుకు? ఎప్పట్నుంచో వస్తూన్న వాటి గురించి యివాళ నేనేమీ చెప్ప లేను. చంద్రుడు ఎన్నేళ్లబట్టి ఆకాశంలో ఉన్నా డంటే ఏం చెప్పను? — ఇలాంటి వెన్నెలలోనే ప్రవరాఖ్యుడు 'విద్యుల్లతా విగ్రహన్, చక్రస్తనిన్, నతనాభిన్, ఒకానొక మరున్నారీశిరోరత్నమున్' చూశాడు."

"తర్వాత జుట్టూ జుట్టూ పట్టుకోడానికే గదా!"

"చూసి, 'ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ' అంటూ తన వూరికి దారి అడిగాడు."

"అప్పుడు వరూధిని ఏమంది తెలుసునా? 'ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు భూసురేంద్ర! యేకాంతమునందునున్న జవరాండ్ర నెపం బిడి పల్కరించు లాగింతయు కాక' అంటూ దులిపేసింది."

"ఆ వెంటనే పూవుఁ బొదరిండ్లను కౌగిట గారవించమంది."

"ప్రవరుడు 'నో' అంటే ఏమంది తెలుసా? 'యజ్ఞ కోటులన్ పావనులౌటకున్ ఫలము మా కవుగిళ్ల సుఖించుటే కదా?' "

"చివరి కేమైంది? 'ఇట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపై తేనియల్' అని తేల్చేశాడు ప్రవరుడు."

ప్రసాద్ అన్నాడు: "ఇలాంటి వెన్నెలలోనే ద్రౌపది భీముణ్ణి సౌగంధిక కమలం తెచ్చిపెట్టమని అడిగింది."

"ఇలాంటి వెన్నెల లోనే రోమియో జూలియట్లు మాట్లాడుకున్నారు."

"ఇలాంటి వెన్నెలలోనే సీత రాముణ్ణి అడవుల్లో ఒకసారి తిరగాలని ఉందని కోరింది."

"ఇలాంటి వెన్నెలలోనే పోర్షియా బెసాని యోతో మాట్లాడింది. క్లియోపాట్రా— ఏంటనీతో మాట్లాడింది. ఆర్నోల్డ్ ప్రేమగీతాలు వ్రాసాడు."

"ఇలాంటి వెన్నెలలోనే కిరణ్మయి చంద్ర కిరణాలకంటె ఎక్కువగా మెరిసి పోతోంది."

నాకు అప్పటికి ఆవలింతలొస్తున్నాయి. నేనన్నాను:

"నిద్రొచ్చేస్తోందండి. లేకపోతే మిమ్మల్ని రాత్రల్లా వర్ణిద్దును. నిద్రాదేవి ప్రక్కమీదికి ఆహ్వానిస్తోంది."

"ఆహ్వానించడానికి ఒకళ్ళుండాలి. అవునా? ఇక్కడ ఆహ్వానించేవారు నిద్రాదేవి. ఎవర్ని ఆహ్వానించింది? నిన్ను. ఒకస్త్రీని. ఇది బావుండలేదు. ఇంకొకలా దీన్ని వివరిస్తాను. నాకూ నిద్ర ముంచుకొస్తోంది. అంటే నన్నూ ఆహ్వానిస్తోందన్నమాట. అలా అనేకంటే యింకా— నిద్ర ఆవేశిస్తోందని అందాం. అప్పుడు ఆహ్వానించేది ప్రక్క. నిద్ర కాదు. అదే ప్రక్క నిన్నూ — నిద్రాదేవి ఆవేశించింది గనుక — ఆహ్వానిస్తుంది. అప్పుడు, బెడ్ తాలూకు ఆహ్వానాన్ని యిద్దరం కాదనలేం గనుక..."

"ఆగండి, ఆగండి. అంతా బాగానే ఉంది కాని, యిందులో రెండు తప్పులున్నాయి. మొదటిది: ఒకే బెడ్ యిద్దర్నీ ఆహ్వానించాలని ఎక్కడా లేదు. నన్ను ఆగదిలో ఉన్న బెడ్, మిమ్మల్ని యీ గదిలో ఉన్న బెడ్ ఆహ్వానించవచ్చు. రెండు: శృంగారం చివరికొచ్చేసరికి మోటుబారిపోయింది."

"అయితే శృంగారాన్ని మరోలా సున్నితం చెయ్యడానికి ప్రయత్నిస్తాను. నిన్ను వర్ణించనా?"

"ఈ వర్ణన ఎన్నోసారి?"

"స్త్రీని వర్ణించు జిహ్వ జిహ్వ."

"అన్యాయ మండోయ్! పురాణాల్లోంచి మీ యిష్టం వచ్చినట్లు వాక్యాలు వాడేసుకుంటున్నారు."

"శనిదేవతేనా సరే పురాణాల్లోంచి తన అవసరానికి తగ్గ వాక్యాలు సేకరించుకోగలదు."

ఇప్పుడు మీరన్న వాక్యం మనస్సులో యింకొకసారి అనుకోండి. మీ జిహ్వ, శనిదేవత జిహ్వ ఒకటే అయ్యేలా ఉంటే, మొదటి మాట — నన్ను వర్ణించనక్కర్లేదు. రెండు— అలాంటి జిహ్వ మీ కక్కర్లేదనే అనుకుంటున్నాను."

ఆ తర్వాత నిద్రకు ఉపక్రమించాం (వేరు వేరు ప్రక్కల మీదకు).

* * *

తర్వాత సీనులో ఒక క్రొత్త పాత్ర ప్రవేశించబోతోంది. ప్రసాద్, నేను మర్నాడు ప్రొద్దుట లేచిన తర్వాత అతను వాళ్ల హాస్టలుకు, నేను కాలిజ్ కి (కాలేజీ అని యింకా ఎవరైనా అంటూంటే వాళ్ళు మోడర్నిటీకి పదేళ్ళ వెనుకగా వస్తున్న వారిలో చేరుతారని మనవి) తయారవుతున్నాం. తయారవుతూంటే ఒక ఉత్తరం వచ్చింది. మా నాన్నగారు చింపి చదువుతూ "అమ్మాయ్, రేపు ఎక్స్ప్రెస్‌లో మీ చెల్లెలొస్తోంది" అన్నారు.

ఈ చెల్లెలు మా చిన్నాన్నగారి కూతురు. పేరు రాజ్యలక్ష్మి, 17. మొన్ననే ప్రీయూనివర్సిటీ పరీక్షలు వ్రాసింది. పరీక్షలవ్వగానే కలకత్తా తప్పకుండా రావాలని నేను వ్రాశాను. అది క్రిందటిసారి వచ్చి రెండు మూడేళ్లవుతోంది. తప్పకుండా వస్తానంటూ జవాబు వ్రాస్తూ అతి ముఖ్యమైన విషయం ఒకటి నాతో చెప్పవలసినది ఉందంటూ వ్రాసింది. రాజ్యలక్ష్మి వస్తోందంటే నాకు చాలా ఆనందం కలిగింది. మేము ముగ్గురం కలిసి కారు మీద మర్నాడు స్టేషన్‌కు వెళ్లి దాన్ని రిసీవ్ చేసుకోవాలను కున్నాను. ప్రసాద్‌తో మర్నాడు ట్రేన్ వేళకు చాలా ముందుగానే మా యింటికి రమ్మని చెప్పాను.

ఆ రోజు సాయంత్రమే మా కారు చెడింది. మర్నాడు మా నాన్నగారు మా యిద్దర్నీ వెళ్లి రిసీవ్ చేసుకోమన్నారు.

ప్రసాద్, నేను బస్సులో వెడుతున్నాం. మే మిద్దరమూ బస్సు ఎక్కినప్పట్నుండి నిలబడే ఉన్నాం. హౌరా బ్రిడ్జి దాటగానే ట్రాఫిక్ జామ్ ఐపోయింది. ఏ వాహనం కదలడం లేదు. రెండు నిముషాలు, మూడు నిముషాలు అయింది. మా ప్రక్కలైన్లో ఉన్నవాటిని ముందు పంపిస్తున్నారు. ఇంతలో

"అబ్బబ్బ ఏమిటీ ఉక్క" అని వినిపించింది. ఆశ్చర్యంతోఎవరా అనిచూస్తే మాకు దగ్గర్లోనే ఉన్న సీట్లో ఇద్దరాడవాళ్ళు కూర్చొని ఉన్నారు. ఒక అమ్మాయి నా వయస్సు గలది. రెండో ఆవిడ ఆ అమ్మాయి తల్లికావచ్చు. ఇందాకటి మాటలు ఆ అమ్మాయి అంది. ప్రసాద్ ఏదో అనబోయాడు. నేను "ఉష్!" అని వారించాను. బస్సులోనేకాదు ఎక్కడేనాసరే తెలుగువారు కనిపిస్తే మేమిద్దరం ఇంగ్లీషులోనే మాట్లాడుకోవాలని అంతకుముందు చెప్పాను అతనితో. ఇది గొప్పకోసం కాదు. నేను పరికిణీ—వోణీ తప్ప వందరకాల డ్రస్‌లు వేస్తూంటాను. ఒకసారి ఒక ముత్తైదువ నేను తెలుగులో మాట్లాడుతూంటే ఒకటే ఆశ్చర్యపోయింది. మన భాషలో చెప్పాలంటే నోరునొక్కుకుంది. అప్పట్నుంచి యీ పాలిసీ మెదలుపెట్టాను. ఆ అమ్మాయి అంది:

"చూడు. అరగంటసేపు బస్సుల్ని ఆపెయ్యడమే కాకుండా మన బస్సు అట్టేబెట్టేసి మిగతా వాటిని ఎలా పంపించేస్తున్నాడో?"

ఇలాంటి ప్లాటిట్యూడ్స్ పలుకుతూంటే విన్న ఏ యువకుడు పెళ్ళి చేసుకుంటాడు యీ అమ్మాయిని? బస్సుల్ని ఎవరూ ఆపలేదు. రెండు, మన బస్సు ఏమిటి? ఈ నాయివ్ తనం పోతేగాని ఆడవాళ్ళు పెళ్ళికి తగరు.

ప్రసాద్ వాళ్ళిద్దరూ కూర్చున్న సీట్‌నే పట్టుకు నిలబడ్డాడు. ఆ అమ్మాయి దృష్టి ప్రసాద్ వేళ్ల మీద పడింది. ప్రక్కనున్నావిడతో అంటోంది:

"అతని వేళ్ళు చూడు. ఆడవాళ్ల వేళ్లలా. గోరింటాకు కూడా పెట్టుకున్నాడు!"

బస్సులో వాళ్ళిద్దరే తెలుగు వాళ్లనుకుందా ఏమిటి? మోరల్: బస్సులో తెలుగులో మాట్లాడకపోయినా తెలుగువచ్చిన వాళ్ళు యింకా ఉండవచ్చు.

గోరింటాకు సంగతి ప్రసాద్ నెప్పుడూ అడగలేదు. తర్వాత బస్సు కదిలింది. స్టేషన్‌లో ప్రవేశించాం. ప్లాట్‌ఫార్మ్ 13. ఎక్స్‌ప్రెస్ ఒకగంట లేటు. కొంతసేపు నిలబడ్డాం. కూర్చున్నాం. మళ్ళీ నిలబడ్డాం. స్టేషన్‌కు సంబంధించిన విషయాలన్నిటి మీదా చర్చించేశాం. ట్రేన్ మాత్రం రాలేదు. ఎనౌన్స్‌మెంట్స్ మాత్రం నిముషానికొకటి వినిపిస్తున్నాయి. ఏ భాషలోదీ బాగా తెలియడంలేదు. నాకు బెంగాలీ కొద్దిగా వచ్చు. హిందీ, ఇంగ్లీషులలో చెప్పినవి కూడా బెంగాలీ లాగే ఉన్నాయి. ప్రసాద్‌తో అదేమాటన్నాను. అతనన్నాడు:

"నిజమే. చివరికి నాకు బెంగాలీలో చెప్పినదే బాగా అర్థమవుతోంది. ఉదాహరణకి చూడు:...ఏ గారో నొంబర్ ప్లాట్‌ఫార్మ్ థేకే దొస్ బజ్ కర్ దో మినిటే ఛాట్‌బే! అంటే, పదకొండో నెంబర్ ప్లాట్‌ఫార్మ్ నుండి పదిగంటల రెండు నిముషాలకు (ఏదోరైలు) బయలుదేరును. మిగతా రెండుభాషల్లోనూ చెప్పనక్కర్లేదని సజెస్టు చేస్తాను. ఐనా ఇంగ్లీషును పట్టుకొని బెంగాలీలా మాట్లాడితే ఎలా?"

"మనం ఇంగ్లీషును తెలుగులా మాట్లాడుతున్నామా, లేదా? బెంగాలీ వాళ్లను అనడం ఎందుకు? అన్నాను.

"ఈ విషయంలో మనం చాలా డెవలప్ అవ్వాలని..."

మధ్యలో ఆపాను "ఆగండి. డెవలప్—ప్రొసీడ్"

"ఆహా! మీనాన్నగారిలా తయారవుతున్నావే" అన్నాడు ప్రసాద్.

"మనం యింకా మాట్లాడుతూంటే మాచెల్లెళ్ళని పట్టుకోవడం కష్టమైపోతుంది. ట్రేన్ వచ్చేస్తోంది" అన్నాను.

ట్రేన్ వచ్చింది. రాజ్యలక్ష్మి దిగింది. సామాన్లు దింపడం, కౌగలింతలు (మేమిద్దరమే) మొదలైనవి. ఐనతర్వాత ప్రసాద్‌ను పరిచయం చేశాను. రాజ్యం చాలా పొడుగైంది. ఒళ్ళు మాత్రం ఏమీ చెయ్యలేదు.

"రెండురోజులు ప్రయాణం అంటే బోరు కొట్టేసిందే. అసలు నాకు ప్రయాణం అంటేనే యిష్టంలేదు" అంది రాజ్యం.

చాలామందికి రైలుప్రయాణం అంటే యిష్టం ఉండదు. ఇది అయిష్టంకాదు. ట్రావెల్ సిక్‌నెస్ లేక ట్రావెల్ ఫియర్ (స్టేజ్ ఫియర్‌లా).

టాక్సీ మీద యింటికి చేరుకున్నాం. ఇంటికి వెళ్ళగానే మానాన్నగారు రాజ్యంతో అన్నారు:

"ఏమే రాజ్యం, నిన్ను పరిపాలించడానికి మీనాన్న యింకా ఏ రాజకుమారుణ్ణీ చూడలేదా?"

రాజ్యం యింతకుముందు వ్రాసిన అతిముఖ్యమైన సంగతి యిది కాదుగదా అని అనుమానం వేసింది. అది ఒంటరిగా ఉన్నపుడు యీ విషయం అడిగాను. ఇక్కడికి వచ్చేముందే ఎవరో పెళ్ళిచూపులికి వచ్చారని చెప్పింది. వివరాలు చెప్పమంటే ఏమీ చెప్పలేదు. అతిగా సిగ్గు పడిపోయింది. పెళ్ళంటే సిగ్గు పోయేవరకూ ఆడవాళ్ళకు పెళ్ళి చెయ్యకూడదు.

మేము నలుగురం కూర్చుని మాట్లాడు కుంటున్నాం. ఆరోజు సాయంత్రం. మానాన్నగారు రాజ్యంను అడిగారు:

"మీ ఊళ్ళో రోజంతా ఎలా తోచిపోతోందే? స్నేహితులెవరేనా ఉన్నారా లేక ఏపనీ లేకుండానే గడిపేస్తున్నావా?"

మధ్యలో ప్రసాద్ అన్నాడు:

"మన ఆడవాళ్ళకి టైమ్ ఎలా గడపాలో తెలియదు."

మానాన్నగా రన్నారు: "మనకు అంతకంటే తెలియదు. వాళ్ళు యింటి దగ్గర వేస్ట్ చేస్తూ ఉంటే మనం ఆఫీసులో వేస్ట్ చేస్తాం."

తర్వాత ఆయన తన తమ్ముడి గురించి కొంతసేపు అడిగారు. నా మనస్సులో యింకొక విషయం వేధిస్తోంది. దీనిచేత పెళ్ళిచూపుల వివరాలు ఎలా చెప్పించడమా? అని. నా బాణం ఉండనే ఉంది. ప్రపోజల్. మా నాన్నగారితో అన్నాను

"నాన్నా, నాదొక ప్రపోజల్. రాజ్యం యిక్కడికి వచ్చేముందే పెళ్ళిమాటలు జరిగాయట. దాని వివరాలు చెబుతుంది."

"మరి చెప్పవేమే? నాకొక ఫాడ్ ఉంది— జేన్ ఆస్టిన్‌లా పెళ్ళి విషయాల గురించి మాట్లాడటం. పెళ్ళికొడుకు పేరేమిటి? ఏ ఉద్యోగం చేస్తున్నాడు? వాళ్ళదేవూరు? నిన్నేం అడిగాడు?"

రాజ్యం అంది. "అతని పేరు ఆదినారాయణ. ఉద్యోగం..."

"అతనే మడిగాడో చెప్పవే" అన్నాను నేను.

"నాకు రెండు నాలుకలు లేవు. ప్రసాద్‌గారు కూడా ప్రశ్నలు వెయ్యడం మొదలుపెడితే నేనెవరికీ సమాధానం చెప్పలేను. పెళ్ళికొడుకు నన్నేమీ అడగలేదు. నాకే సిగ్గయితే అతను రెట్టింపు సిగ్గుతో కూర్చున్నాడు."

మానాన్నగారన్నారు: 'మరింకెందుకుట రావడం. యువకులందరికీ యిదే నా సందేశం — రావ్, మేక్ నోట్—పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యం కలిగినప్పుడు గాని, ప్రేమించడానికి ముందు గాని రెండు పన్లు చెయ్యాలి. ఒకటి, 'లవర్స్ మస్ట్ లర్న్' సినిమా చూడాలి. ఎందుకంటే ప్రేమికులు నేర్చుకోవలసింది చాలా ఉంది. రెండు, 'రోమియో అండ్ జూలియట్' క్షుణ్ణంగా చదవాలి. ముఖ్యంగా లవ్ సీన్స్. ఆడదాని ముందు ఒక్కమాట కూడా మాట్లాడలేని మగాడెందుకండి! పోనీ, రాజ్యం, మిగతా వాళ్ళేమడిగారు?"

"వాళ్ళ నాన్నగారనుకుంటాను 'పాటలు వచ్చునా?' అని అడిగారు."

ఆడపిల్లలే ఎందుకు పాడాల్ట? ఇంత చదువూ చదువుకుని చాలామంది పెళ్ళెలా చేసుకోవాలో తెలుసుకోలేకపోతున్నారు. అమ్మాయి అందంగా ఉండాలి, తెల్లగా ఉండాలి, వీణ వాయించాలి, బెర్నార్డ్ షా చదివి ఉండాలి, సార్త్రే ఎవరోతె లిసుండాలి, లిజ్ టేలర్ సినిమాలు చూసుండాలి. పెళ్ళికొడుకుల మాట కొద్దాం. ఈ ఆదినారాయణ మాట కాదనుకో. కొంతమంది మాట. బయటికి ఎంత నీట్‌గా తయారై వస్తారో రూమ్‌లో దానికి వ్యతిరేకం.జుట్టెలా దువ్వుకోవాలో తెలియదు. ఇవన్నీ కూడా చూడ్డానికి ఆ భార్యామణి రావలసిందే. అప్పుడే అయిందా, క్లాసిక్స్ మాట వింటే ఆనుడ దూరానికి పరుగు.ఆ పరుగు సినిమా హాలుకు. సినిమా బోరు కొట్టేసిందంటూ రూమ్‌

క్చొచ్చి నాలుగు సిగరెట్ల్లు కాల్చేసి మర్నాడు తొమ్మి దింటికి లేవడం. ఆటలన్నవి ఎరుగరు. డిబేట్సంటే భయం. ఇంటర్వ్యూలంటే బెదురు.''

ప్రసాద్ అన్నాడు: ''ఈ రోజుల్లో అటూ యిటూ కూడా పెళ్లిపెద్ద సమస్యే.''

''దానికేముంది? ఈ అరగంట ఇంటర్వ్యూ లంటూ తీసి పారెయ్యాలి. అందంగా లేని వాళ్లందరికీ పెళ్లిళ్లవనక్కర్లేదా ? కాలిజ్ ల్లోను, యూని వర్సిటీల్లోనూ ఫ్రీగా తిరగనిస్తే ముందు ఆడదానితో మాట్లాడటం అంటూ తెలుస్తుంది. అందంగా ఉన్న అమ్మాయి ఎవరితోనూ మాట్లాడకుండా తిరిగితే ఆవిడకు పాస్ట్ ఉందని, ఫ్రీగా తిరిగితే ప్రజంట్ ఉందని అనేస్తారు. రెండువిధాలా ఫ్యూచర్ లేదు ఆ అమ్మాయికి. మిగతా వాళ్లకు ఎలాగాలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆడవాళ్లు మగవాళ్లను ఇంటర్వ్యూ చెయ్యడానికి సిద్ధంగా ఉండాలి. దానికి తగిన ప్రయత్నం చెయ్యాలి. ఒకటే—కలిసి తిరగండి కొన్నాళ్లు ఎవరు వద్దన్నారు?''

''మొరాలిటీ సంగతి ఆలోచించాలండి మనం'' అన్నాడు ప్రసాద్.

''అదంతా పైచోట. అమెరికాలో డివోర్సులు ఎక్కువగా ఉంటే, యిక్కడా ఎక్కువగా ఉంటాయని ఎందుకనుకోవాలి? అక్కడ రోజుకు వందమంది ఆడ వాళ్లను కలుసుకుంటారు. నువ్వు చదువుకున్నన్నాళ్లూ ఒక అమ్మాయితోనేనా మాట్లాడావా? స్త్రీ గురించి పూర్తిగా తెలియకముందే పెళ్లి, పెళ్లి గురించి పూర్తిగా తెలియక ముందే పిల్లలు —నేను ఆపడం మంచిది. రాజ్యం ఆవలిస్తోంది, రేణు ఎటో చూస్తోంది'' అన్నారు మానాన్నగారు.

టీతో ఆరోజు కార్యక్రమం ముగిసింది.

* * *

మరొకరోజు, మానాన్నగారు యింట్లోలేరు. మేం ముగ్గురం కూర్చొని ఉన్నాం. రాజ్యంతో అన్నాను

''ఏమే, మీ సుందరాకారుణ్ణి వర్ణించలేదు. చెప్పు, మేమూ విని ఆనందిస్తాం.''

రాజ్యం అంది: ''ఏమోనే, నాకు వర్ణించడం చేతకాదు. లావుగా మాత్రం ఉన్నాడు. కొద్దిగా బొజ్జ ఉన్నట్టుకూడా అనుమానం.''

ప్రసాద్ అన్నాడు: ''బొజ్జా?! ఆ ఆదినారాయణ గారికి ఎన్నేళ్లుంటాయేమిటి?''

''బొజ్జ కొద్దిగా ఉంది గనుక పాతికేళ్లుంటా యేమో!'' అంది రాజ్యం.

నేనన్నాను: ''కాని కాన్వర్స్ మాత్రం నిజం కాదు.''

''కాన్వర్సంటే ఏమిటి?'' అంది రాజ్యం.

''విపర్యయం'' అన్నాడు ప్రసాద్.

''విపర్యయం అంటే?

నేనన్నాను: ''మార్జాలం. అదీ తెలియక పోతే ఎలా? హైస్కూల్లో నేర్చుకున్నది అప్పుడే మర్చిపోయావా? నీకు ఆదినారాయణ రావలసిందే. పోనీ ఒక ఉదాహరణ చెబితే బోధపడుతుంది. రైల్లో అనవసరంగా చేన్‌లాగితే రెండువందల యాభై రూపాయలు ఫైన్ అని రూలు. కాని రెండువందల యాభై రూపాయలు దగ్గరున్నాయి కదా అని చేన్ లాగడం రూలు కాదు.''

ప్రసాద్ అన్నాడు: ''రేణూ, అనవసరం అని ముందు అంటూ మళ్లీ చేన్ లాగడం బాగాలేదు. నేను మరొకటి చెబుతాను. వెనకటి కొకాయన తద్దినం పెడదామనుకుంటూంటే పనసకాయ దొరికితే వండి పెట్టాడు. అలాగని పనసకాయ దొరికి నప్పుడల్లా తద్దినం పెట్టాలని ఎక్కడాలేదు.''

నేనన్నాను: ''నే నింకొకటి చెప్పనా? వెనకటి కొకాయన భార్య ఎఱ్ఱ చీర కట్టుకుంది. అందుచేత ఎఱ్ఱ చీర కట్టుకున్న వాళ్లంతా ఆయన భార్యలనడం తప్పన్నమాట.''

"కొంతమంది జుట్టు చెరిగిపోతే దువ్వుకుంటారు. కొంతమంది దువ్వెన జేబులో ఉంది కదా అని దువ్వుకుంటారు."

"నేనింకా మంచిది చెబుతాను. పైథాగరస్ సిద్ధాంతానికి విపర్యయం...."

రాజ్యం మధ్యలో ఆపింది: "మీరిద్దరూ ఆగండి. నేనొకటి చెప్పనా? అవసరం వచ్చినప్పుడు ఉదాహరణలు చెబితే అందంగానే ఉంటుంది. కాని ఉదాహరణ లున్నాయి గదా అని అవసరం కల్పిస్తే..."

నేను మధ్యలో అన్నాను: "దీనర్థం ఏమిటి? మమ్మల్నిద్దర్నీ నోరుమూసుకోమని."

రాజ్యం అంది: "దీనర్థం ఏమిటి? నన్ను మాట్లాడ్డం సరిగ్గా నేర్చుకోమనా?"

"నీకు నేను నేర్పగలనా? ఆదినారాయణగారి గురించి చెప్పు."

"ఆదినారాయణ, ఆదినారాయణ— నేను చెప్పను. ఇంకో విషయం మాట్లాడుకుందాం. లేకపోతే బయటికిపోదాం."

* * *

రాజ్యం పదిహేను రోజులు ఉంది. రోజూ ప్రసాద్, నేను, అది కలిసే తిరిగేవాళ్లం. అది వెళ్లిపోయే లోపలే మానాన్నగారితో ఒక విషయం చెప్పాలని, దాని పర్యవసానం రాజ్యంతో చెప్పాలని ఆలోచిస్తూ వచ్చాను. మర్నాడే దాని ప్రయాణం.రోజూలాగే ప్రసాద్ సాయంత్రం వచ్చి మర్నాడు మాతో స్టేషన్‌కు వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. మానాన్నగారితో ఒంటరిగా మాట్లాడడానికి అవకాశం కోసం చూస్తున్నాను. రాత్రి భోజనం అవగానే రాజ్యం నిద్రపోయింది.. డ్రాయింగ్ రూమ్‌లో నేను, మానాన్నగారు కూర్చొని ఉన్నాం. ఆయనేదో పుస్తకం చదువుతున్నారు. నేను మాగజైన్ చదువుతున్నట్లు నటిస్తున్నాను. కొంతసేపైన తర్వాత అన్నాను:

"నాన్నా, మిమ్మల్నొక ప్రశ్న అడుగుతాను. సమాధానం చెప్పాలి."

ఆయన తలెత్తి "తప్పకుండా" అన్నారు.

"నేనొక స్వయంవరం ఏర్పాటు చేస్తున్నాననుకోండి.వచ్చిన రాజకుమారుల్లో ప్రసాద్ ఒక కాండిడేట్ అనుకోండి. పూలమాల ఎవరి మెడలో వెయ్యాలి?

"స్వయంవరం అంటే స్వయంగా వరించడం అని. తండ్రి చెప్పిన వాళ్ల మెడలో హారం వెయ్యమని కాదు."

"నేను ప్రసాద్ మెడలో హారం వేసేస్తున్నాను."

"కంగ్రాచ్యులేషన్స్!! లైసెన్స్‌కి అప్లై చేశారా? అతనితో చెప్పావా?"

"రేపు అతనితో యీసంగతి చెబుదామనుకుంటున్నాను" అన్నాను.

* * *

మర్నాడు పదిగంటలకు ప్రసాద్ మాయింటికి వచ్చాడు. నేను ఆశ్చర్యపోయాను. సాయంత్రం గదా ట్రేన్. గదిలో నేనొక్కర్తెనే ఉన్నాను. సరాసరి నాదగ్గరకు వచ్చి కూర్చున్నాడు.

"రేణూ, నీతో అర్జంట్‌గా ఒక విషయం చెప్పడానికే యిప్పుడు వచ్చాను. మానాన్నగారి దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. నేనివాళే యింటికి ప్రయాణం అవ్వాలి." ఆ ఉత్తరం చూశాను. వ్యవహారాలేవో మాట్లాడాలని,వెంటనేబయల్దేరిరావలసిందనిసారాంశం.

మానాన్నగారితో చెప్పాం. తర్వాత పనులు చక చకా జరిగిపోయాయి. మానాన్నగారు ఆరోజే రాజ్యం వెళ్లే ట్రేన్‌లో రిజర్వేషన్ కోసం ప్రయత్నించమన్నాడు. రిజర్వ్ చెయ్యగలిగాం.

వీడ్కోలు. స్టేషన్‌కు వెళ్లిన తర్వాత ఎవరమూ ఎక్కువగా మాట్లాడటంలేదు. రాజ్యంతో మాత్రం నాకు తోచినవన్నీ చెబుతున్నాను. మొట్టమొదటిసారిగా దాని పెళ్లికి అటువైపు వస్తాననీ, బాగా చదువుకోమనీ,ఉత్తరాలు తరచుగా వ్రాయాలనీ— మిగతావన్నీ మామూలు బోధలే.

* * *

వారంరోజులయింది. రాజ్యం దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. ప్రసాద్ వ్రాయలేదు. పదిరోజులు. పదిహేను రోజులు. రోజులు గడుస్తున్న కొద్దీ ఏరోజుకారోజే ప్రసాద్ దగ్గర్నుండి ఉత్తరం వస్తుందని ఎదురు చూస్తూనే ఉన్నాను. ఉత్తరంవచ్చినా అందులో ఏముంటుందోననే ఆత్రతత కొంత. ఉత్తరాలన్నీ ఒకలాగే ఉండవు. ఉనికి వేరైనట్లుగానే పరిస్థితులు కూడా వేరువేరుగా ఉంటాయి. కొన్నివందల మైళ్ల దూరంలో మనుష్యులు ఎలా ఉన్నారో, ఏం చేస్తున్నారో ఊహించడమంటే కష్టమే. అక్కడనుంచి ఉత్తరం రాకపోతే

కొంత ఊహించవచ్చు. ఉత్తరం వస్తే మరికొంత ఊహించవచ్చు. కాని మనిషి ఎదురుగా ఉండడంవేరు. ఐనా ఒక విషయం. కొన్ని విషయాలు ఎదురుగా చెప్పలేనివి ఉత్తరాల్లో వ్రాయడం తేలికగా ఉంటుంది. మాట్లాడేటప్పుడు ఆలోచించుకోడానికి గల సమయం కంటే వ్రాసేటప్పుడు ఎక్కువ.

ఒకనెల దాటిన తర్వాత ప్రసాద్ దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. మానాన్నగారు, నేను కూర్చొని ఉన్నాం. ఉత్తరం విప్పి మానాన్నగారు కూడా వినేలా చదివాను.

"డియర్ రేణూ,

ఉత్తరం ఎలా మొదలు పెట్టాలో తెలియకుండావుంది. మొదలుపెట్టిన తర్వాత ఎలా వ్రాయాలో తెలియడంలేదు. అంత్య నిష్ఠూరం కంటె ఆది నిష్ఠూరం మేలన్నారు గనుక యిక్కడికి నేను రాగానే జరిగిన సంగతి వ్రాస్తాను. ఆ సంగతి నా పెళ్ళి గురించి. ముందు ఒక విషయం చెప్పడం అవసరంగా భావిస్తున్నాను. నిన్ను నేను ప్రేమించాను. ప్రేమించానని చెప్పడానికి అక్కడ ఉన్నన్నాళ్ళూ ఎలా చెప్పాలో తెలియలేదు. మానాన్నగారితో మాట్లాడి, తర్వాత మీనాన్నగారితో మాట్లాడి నీమనస్సు తెలుసుకుందామని అనుకున్నాను.

చిన్నప్పటినుండీ మా నాన్నగారి ప్రభావం నామీద చాలావుంది. నా పెళ్ళి, మిగతా యింటి విషయాలు ఒకదానికొకటి చాలా సంబంధం కలిగి ఉన్నాయనీ, ఆయన ఊహించిన పరిస్థితుల్లో నేను నిన్ను పెళ్ళి చేసుకోవడం ఆర్థికంగానూ, సాంఘికంగానూ తనకేవిధంగానూ యిష్టంలేదని తేల్చి చెప్పేశారు. తండ్రి అన్న ఒక్కమాట, మిగతా వాళ్ళు అన్న పది మాటల్లా పని చేస్తుంది కొందరి మీద. ఆ మాటలో అధికారం, ఆవేశం అక్కర్లేదు. నామీద ఏది ఆపరేట్ చేస్తోందో వివరించలేకపోతున్నాను. ఒక సంబంధం చూశాను. వివరాలు యిప్పుడు రాయాలనిపించడం లేదు. అటుపూర్తిగా మోడర్న్ కాలేక, యిటుపూర్తిగా తల్లిదండ్రులు చెప్పినది కాదనలేక ఏంచెయ్యాలో తెలియని పరిస్థితుల్లో చాలామంది యువకులు నాలాంటి వాళ్ళు ఉన్నారని నీకు తెలిసే ఉంటుంది. అందుచేత నన్నపార్థం చేసుకోవని తలుస్తాను..."

మానాన్నగారన్నారు: "ఈ అపార్థం అన్న పదం తెలుగుభాషలోంచి ఎంత త్వరగా తీసేస్తే అంత మంచిది."

"...నా బలహీనత మీద(ఇది పూర్తిగా బలహీనత కాదని చెప్పగలను) మీనాన్నగారు చాలా వ్యాఖ్యానించి ఉండవచ్చు. కాని నువ్వు అర్థం చేసుకుంటావనే తలుస్తాను.

నీ మనస్సు నాకిప్పటికీ తెలియదు. నీ మనస్సులో నేను ఉండి ఉంటే అందులో నుండి నిర్దాక్షిణ్యంగా పైకి వచ్చేసినందుకు నువ్వు బాధపడవచ్చు. భార్యగా నిన్ను పొందలేకపోవడానికి నేనే పూర్తిగా కారకుణ్ణి కానని రాస్తే ఆనందిస్తాను.

నా హృదయంలో ఉన్నదంతా నీకు వ్రాసేశాను. మళ్ళీ కలకత్తా వస్తానో రానో చెప్పలేను. స్నేహపూర్వకంగా మాత్రం ఉత్తరాలు వ్రాస్తూ ఉండు.

ఇట్లు,
ప్రసాద్"

పి.ఎస్: మీ నాన్నగారివల్ల నేను నేర్చుకున్నది చాలా ఉంది. దాన్ని జీవితంలో ఉపయోగించడానికి ప్రయత్నిస్తానని మీనాన్నగారితో చెప్పు. నా రిగార్డ్సు కూడా అందజెయ్యి.' "

ఉత్తరం పూర్తిచేసి మా నాన్నగారి వైపు తిరిగాను.

"బావుందమ్మాయ్. ప్రసాద్ వ్రాసింది సబబుగానే తోస్తోంది. ఆర్థిక సాంఘిక పరిస్థితులు అందరివీ ఒకలాగే ఉండాలని లేదు. ఉన్నా ఐడియాలజీస్ ఒకలా ఉండాలని లేదు. ఎవరికి తోచినది వాళ్ళు చెప్పడంలో తప్పు లేదుగాని అది అందరూ ఒప్పుకోవాలనుకోవడం అంత మంచిదిగాదు. ప్రసాద్ జీవితం తాలూకు మిగతా ఫాక్టర్స్ తెలియకుండ నాకు నచ్చిన యీక్వేషన్‌లో అతన్ని యిముడ్చడం భావ్యం కానేకాదు. ఐడెంటిటీస్ గురించి, ట్రూయిజమ్స్ గురించి యింకా ఆలోచిస్తాను. ప్రసాద్‌కు వ్రాసేటప్పుడు మాత్రం నా గుడ్ విషెస్ వ్రాయి" అన్నారు మానాన్నగారు.

మర్నాడు ప్రసాద్‌కు జవాబు వ్రాసాను:

ప్రసాద్‌గారికి,

మీ ఉత్తరం అందినది. సంగతులు తెలిసినవి. క్లిష్టమైన విషయాలను సటిల్‌గా నా మనస్సుకు

హత్తుకొనేటట్లు వ్రాసారు. నా మనస్సు మీకు తెలియలేదని వ్రాసారు. తెలియజెయ్యడం భావ్యం. మీరు బయల్దేరడానికి ముందురోజే మానాన్నగారితో ప్రసాద్ అనే రాజకుమారుణ్ణి నేను వరించానని చెప్పాను. ఆయన సంతోషం వ్యక్తపరిచారు. మర్నాడు మీతో యీ విషయం గురించి మాట్లాడటానికి అవకాశం దొరకలేదు. 'స్త్రీ ఒకసారే పురుషుడికి హృదయం అర్పిస్తుంది'—యిలాంటివన్నీ వెనుకటి మాటలు... హృదయం అర్పించగానే ఎదుటి వారు అందుకోగలిగి ఉండాలని, ప్రేమించుకోగానే పెళ్ళిచేసుకోవాలని, ప్రేమికులకు పెళ్ళి కాకపోతే జీవితంలో వాళ్ళు మళ్ళీ కలుసుకోకూడదని — యిలా అనుకుంటే జీవితంలో వచ్చే కష్టాలను(మానసికమైనవి కూడా) ఎదుర్కోడానికి ధైర్యంలేని వారన్నమాట. అలాంటి వారు పైకి రావడం కష్టం. కొన్నాళ్ళ పాటైనా నా మనస్సు మీద పడిన ముద్ర గురించి ఆలోచించకుండా ఉండలేను. కొంతకాలానికి మట్టుకు కాంప్రొమైజ్ కు రాగలననే ధైర్యం ఉంది. మీరుకూడా మీ పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కొంటారని ఆశిస్తున్నాను.

ఆడవాళ్లలో తేడాలున్నట్టే, మగవాళ్ళలోనూ ఉంటాయి. రాజ్యానికి పదహారేళ్ళు వచ్చినప్పట్నుంచి పెళ్లి చేసెయ్యాలని వాళ్ల నాన్న ఎంత తొందర పడుతున్నారో, నా అంతట నేను పెళ్లి చేసుకోవాలనుకునేవరకూ ఆమాట తలపెట్టలేదు మానాన్నగారు. రాజ్యం ఉత్తరం వ్రాసింది—పెళ్లి గురించి నువ్వేమనుకుంటున్నావంటూ. మా యిద్దరి పెళ్లిళ్ళూ ఒకలా జరుగవు. ఆ విధంగానే మీరు, దాన్ని చూడ్డానికి వచ్చిన ఆదినారాయణ గారూను. మీరు కలకత్తాలో ఉంటే, ఆయన ఆంధ్రాలో ఉన్నారు. సొసైటీస్ తాలూకు ప్రభావం మన మీద లేకపోతే మనం మానవులమే కాము. ఆయన చదువుసంధ్యలు వేరు, ఆయన పెరిగిన పరిస్థితులు వేరు. మీ పరిస్థితులు వేరు.

మీ పరిస్థితుల్ని నేనుపూర్తిగా అర్థం చేసుకోగలుగుతున్నాను. నాకు పుట్టినప్పటి నుండి ఆర్థిక యిబ్బందులన్నవి తెలియవు. అనుభవిస్తేగాని చాలా విషయాల గురించి మాట్లాడలేమని నా ఉద్దేశ్యం. నాకంటె జీవితంలో ఎక్కువ అనుభవం (యిబ్బందుల విషయంలో) ఉన్న మీరు వ్రాసినవన్నీ నేను అర్థం చేసుకోగలిగాను.

మీ ఉత్తరం మా నాన్నగారికి చదివి వినిపించాను. మా నాన్నగారు మీరనుకున్నట్లు వ్యాఖ్యలేవీ చెయ్యలేదు. ఇప్పటికే యిలాంటి విషయాల మీద ఆలోచించి ఉన్నా మిగతా ఫాక్టర్స్ కూడా కన్సిడర్ చేసి తన రిసర్చ్ కొనసాగిస్తున్నారు. ఆ రిసర్చ్‌లో ఐడెంటిటీస్ అని, ట్రూయిజమ్స్ అని ఏవో అన్నారు. నాకు అంతగా బోధపడలేదు. మీరు మాథ్‌మెటిక్స్ వారు గనుక యీ ఐడెంటిటీస్ యొక్క అర్థం వివరించగలరు.

మనం జీవితాంతం స్నేహితుల్లా ఉండిపోవడానికి మన మధ్యలో ఎవరి ఆటంకమూ లేదు. మీపెళ్లి త్వరలోనే జరగవచ్చని ఆశిస్తున్నాను. రావడానికే ప్రయత్నిస్తాను. పెళ్లియిన తర్వాత మీ భార్యతో మాత్రం మనిద్దరికీగల పరిచయం పూర్తిగా తెలియజేయవలసిందిగా కోరుతున్నాను. ఈ ఉత్తరం మీ భార్యకు తప్పకుండా చూపించండి. లేకపోతే ఆవిడ నన్ను మరోలా ఊహించుకోవచ్చు. మానాన్నగారు మీకు తన గుడ్ విషెస్ తెలియజెయ్యమన్నారు. మీరు వెంటనే జవాబు వ్రాయాలి. మీ ఉత్తరం కోసం రేపట్నుంచే ఎదురు చూస్తాను.

ఇట్లు
"కిరణ్మయి"

★

[''ఈ కథలో కొన్ని ఇంగ్లీషు పదాలు వాడవలసిన అవసరం కలిగింది. కొన్ని ఇంగ్లీషు పదాలను మనం ఉచ్చరించ గలిగినా వ్రాసేటప్పుడు చిక్కులొచ్చే సందర్భాలు కొన్ని ఉన్నాయి. ఉదాహరణకు 'బాంక్' అనిగాని, 'బేంక్' అనిగాని వ్రాస్తే బావుండదు కనుక, 'బ్యాంక్' అని వ్రాస్తున్నాము. మొదటి రెండూ వ్రాసేటప్పుడు ఎంత బావుండలేదో, మూడోది పలికేటప్పుడు అలాగే బావుండదని అంతా ఒప్పుకుంటారు. అక్షరం లేకపోతే సృష్టించాలని నా ఉద్దేశ్యం. ఏది ప్రవేశపెట్టినా మొదట్లో కష్టంగానే ఉంటుంది. కాని అలవాటుపడిన తర్వాతగాని దానిలోగల లాభనష్టాలు అంచనా వెయ్యలేం. ఈ దృష్టితో ఆలోచించి

ఇంగ్లీషులో 'ఆ' కారానికి 'ఏ' కారానికి మధ్యలో పలకవలసివచ్చినప్పుడల్లా రెండు స్వరాలూ కలిసిన ఒక సంకేతం "పెట్టుకోవాలి" అని ఈ రచయిత సూచించారు.]

కాని,

ఒక భాషకు పరిసర భాషలతోనో, అన్యదేశభాషలతోనో సన్నిహితత్వం ఏర్పడినప్పుడు కొన్ని కొత్త ఉచ్చారణలు ఆ భాషలో ప్రవేశిస్తాయి. వాని కొక ప్రత్యేకమైన అక్షర సంకేతం లేకపోయినా జనం ఆ ప్రత్యేకోచ్చారణలను అలవరచుకుని వ్యవహరిస్తారు. ఇది అనాదిగా వస్తున్న విషయం. తెలుగులో తాటాకు, బోడావు వంటి పదాల మధ్యాచ్చుఉచ్చారణ ఇలాటిదే. ఇది మన ప్రాచీన లాక్షణికులదృష్టికి రాకపోలేదు. కాని వారు అది కూడా సంధికార్యం పరిణామంగా వచ్చినదన్న భావంతోనో, అకారోచ్చారణ భేదం అని అనుకోవడం వల్లనో ప్రత్యేకాక్షర సంకేతం పెట్టుకోలేదు.

అయితే ఇంగ్లీషు సంబంధంతో మనకు ఈ ఉచ్చారణ—నాలుకను దొర్లించిగాని, పెదవులను అప్పళించి గాని చేసే ఉచ్చారణ—చాలా అవసరమైంది. దీనిని గుర్తించడానికి ఆయాచోట్ల చుక్కలో, గీతలోపెట్టి వుచ్చరించే పద్ధతిని శ్రీ లక్ష్మణరావు మొదలయినవారు సూచించారు. భారతి లోగడ ఈవిధంగా కొన్ని వ్యాసాలు ప్రకటించి కూడా వుంది.

కాని, ఈ ఉచ్చారణ ఆంగ్లభాష సంబంధంవల్ల తెలుగువారికి బాగా అలవాటయింది గనుక, దీనికి ప్రత్యేక లిపి అవసరం లేదని, పాఠకులు ఆ విధంగా చదువుకోగలరని మా విశ్వాసం. —సం॥]

---

